RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 181 | ఆగస్టు 01 శనివారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 181 | August 01 Saturday2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |

గోదావరికి భారీగా వరద

2

# ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం



**హైదరాబాద్ జనసంఘర్షణ :** తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడులకు కేంద్ర బిందువుగా మలచడంతో పాటు రాష్ట్ర యువతకు విస్తృత స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇటీవల సచివాలయం మరియు మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల వికాస కేంద్రంలో వరుస సమీక్షలు నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఆర్థిక రంగాన్ని పరుగులు తీయించేందుకు స్పష్టమైన ప్రణాళికను ప్రకటించారు. విదేశీ ఉద్యోగాల కోరుకునే యువత కోసం టామ్‌కామ్ సంస్థకు సరికొత్త బాధ్యతలు అప్పగిస్తూ, ఒక మాజీ ఐఎఫ్ఎస్ అధికారిని దానికి సీఈఓగా నియమించాలని నిర్ణయించారు. పాస్‌పోర్ట్ సేవలు, డ్రైవింగ్ శిక్షణ మొదలుకొని నైపుణ్యాభివృద్ధి, విదేశీ మ్యాన్‌పవర్ కంపెనీలతో ఒప్పందాల వరకు ఒకే గొడుగు కిందకు తీసుకురానున్నారు. దీనికితోడు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో పరిశోధన కేంద్రంతో పాటు జర్మన్, జపనీస్, కొరియన్ వంటి విదేశీ భాషలను నేర్పించేందుకు ప్రత్యేక విభాగాలు అందుబాటులోకి తెస్తున్నారు. మరొకవైపు ఏటీసీల్లో డ్రోన్ టెక్నాలజీ, ఈవీ సర్వీసింగ్ కోర్సులను ప్రవేశపెట్టి చదివిన ప్రతి ఒక్కరికీ వంద శాతం ఉద్యోగాలు కల్పించేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, ఐటీఐ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లతో పాటు గ్లోబల్ డిమాండ్‌కు తగ్గట్టు కొత్త నర్సింగ్ కళాశాలలను కూడా ప్రారంభించనున్నారు. ఇక రాష్ట్ర సమగ్ర విస్తరణకు సీఐఐ ప్రతినిధుల భేటీలో సీఎం పిలుపునిస్తూ, 2037 నాటికి తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మలచడమే కాకుండా దేశ జీడీపీలో రాష్ట్ర వాటాను పది శాతానికి పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్పష్టం చేశారు. ముప్పై వేల ఎకరాలలో నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ, మచిలీపట్నం 12 లేన్ల రహదారి, 360 కిలోమీటర్ల రీజినల్ రింగ్ రోడ్డు పారిశ్రామిక విస్తరణలు రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చనున్నాయి. తెలంగాణకు రానున్న మూడు బుల్లెట్ రైళ్లు, గ్రీన్ సిగ్నల్ సాధించిన వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలు రవాణా రంగానికి కొత్త ఊపిరి పోయనున్నాయి. స్థిరమైన పారిశ్రామిక విధానాలతో అమెజాన్, అదానీ వంటి అంతర్జాతీయ దిగ్గజాలను ఆకర్శిస్తూ, ప్రపంచంలోని టాప్-500 కంపెనీలను రాష్ట్రానికి రప్పించడమే తమ ధ్యేయమని సీఎం స్పష్టం చేశారు.

# రైతు సంక్షేమానికి పెద్దపీట



**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా వివిధ రంగాభివృద్ధిని వేగవంతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం భారీ నిర్ణయం తీసుకుంది. సమాజంలోని వేర్వేరు వర్గాలకు లబ్ధి చేకూర్చేలా దాదాపు 4.5 లక్షల కోట్ల రూపాయల (రూ. 4,50,988 కోట్లు) విలువైన పలు కీలక పథకాలు, ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ అధికారిక ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పిఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి 2026 నుండి 2030 మధ్య కాలానికి గాను రూ. 3,15,614 కోట్లు కేటాయించారు. అలాగే హరిత ఇంధన రంగాన్ని బలోపేతం చేసేందుకు 'ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజన'కు రూ. 5,070 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ కొత్త పథకం ద్వారా డ్యామ్‌లు, సరస్సులపై తేలియాడే (ఫ్లోటింగ్) సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసి 5,000 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వచ్చే ఐదేళ్లలో ఈ విధానంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ఏడు రెట్లు పెంచనున్నట్లు మంత్రి వివరించారు.

మరోవైపు సముద్రంలో దాగి ఉన్న ముడిచమురు, సహజ వాయువు నిల్వలను అన్వేషించేందుకు ఉద్దేశించిన 'సముద్ర మంథన్' పథకానికి 2030-31 వరకు రూ. 84,084 కోట్లు వినియోగించనున్నారు. క్రీడారంగంలో ప్రోత్సాహాన్ని మరింత పెంచేందుకు రాబోయే ఐదేళ్ల కాలానికి 'ఖేలో ఇండియా' పథకానికి రూ. 29,054 కోట్లు కేటాయించారు. మౌలిక వసతుల కల్పనలో భాగంగా యూని డైరెక్షనల్ ట్విన్ ట్యూబ్ టన్నెల్స్ నిర్మాణానికి మరో రూ. 9,779 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర కేబినెట్ వెల్లడించింది.

# శిఖరాగ్ర సదస్సుకు భారత్ ఆతిథ్యం




**న్యూఢిల్లీ జనసంఘర్షణ :** వచ్చే సెప్టెంబర్ 12, 13 తేదీల్లో న్యూఢిల్లీ వేదికగా జరగనున్న ప్రతిష్టాత్మక 'బ్రిక్స్' శిఖరాగ్ర సదస్సుకు భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ సమావేశానికి చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో పాటు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ హాజరుకానుండటంతో అంతర్జాతీయంగా తీవ్ర ఆసక్తి నెలకొంది. 2020లో గల్వాన్ లోయలో ఇరుదేశాల సైనికుల మధ్య ఘర్షణ జరిగిన తర్వాత జిన్‌పింగ్ భారత్‌కు రావడం ఇదే తొలిసారి కానుంది. చివరిగా ఆయన 2019లో తమిళనాడులోని మామల్లపురంలో ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఈ ఏట బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్న భారత్‌కు చైనా ప్రభుత్వం పూర్తి మద్దతు ప్రకటించింది. అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య సహకారానికి బ్రిక్స్ కీలక వేదిక అని, ఢిల్లీ సదస్సు విజయవంతానికి సహకరిస్తామని చైనా విదేశాంగ శాఖ తెలిపింది. రష్యా అధ్యక్షుడు పుతిన్ రాకను క్రెమ్లిన్ వర్గాలు ఇప్పటికే ధ్రువీకరించగా, ఇరాన్‌తో పాటు బంగ్లాదేశ్ ప్రధానిని కూడా ఈ సదస్సుకు మోదీ ఆహ్వానించారు. బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికాలతో ప్రారంభమైన ఈ కూటమిలో ఇటీవల ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, యుఏఈ, ఇండోనేషియా సభ్యత్వాలు పొందడంతో ఈ సదస్సు అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

# (పీఓకే)లో కాల్పులు




**న్యూఢిల్లీ జనసంఘర్షణ :** పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) ప్రాంతంలో నిరసన తెలుపుతున్న పౌరులపై పాక్ సైన్యం సాగిస్తున్న దాడులు, అరాచకాలపై భారత్ తీవ్ర దిగ్భ్రాంతిని, నిరసనను వ్యక్తం చేసింది. ఈ దారుణాలపై అంతర్జాతీయ సమాజం వెంటనే దృష్టి సారించి, పాకిస్థాన్‌ను జవాబుదారీగా చేయాలని భారత విదేశాంగ శాఖ పిలుపునిచ్చింది. స్థానిక మానవ హక్కుల సంఘాలు మరియు జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ అందించిన వివరాల ప్రకారం, రావల్ కోట్, మీర్‌పూర్, కోట్లీ, ముజఫరాబాద్ సహా పలు ప్రాంతాలలో శాంతియుతంగా లాంగ్ మార్చ్ నిర్వహిస్తున్న పౌరులపై పాక్ సైన్యం విచక్షణారహితంగా కాల్పులకు తెగబడింది. ఈ దాడుల్లో నలభై మందికి పైగా నిరసనకారులు మృతి చెందగా, వంద మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. అలాగే వందలాది మందిని అక్రమంగా నిర్బంధించి జైళ్లకు తరలించారు. సైన్యం తమ దౌర్జన్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఆసుపత్రులు, వీధుల నుంచి అమాయకుల మృతదేహాలను బలవంతంగా ఎత్తుకెళ్లి మాయం చేస్తోందని స్థానిక నేతలు ఆరోపిస్తున్నారు. అక్కడ జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనలను భారత్ తీవ్రంగా ఖండిస్తూ అంతర్జాతీయ వేదికలపై నిలదీసింది.

## అంతర్జాతీయ విమానాశ్రయం తో మారనున్న ఉత్తరాంధ్ర రూపురేఖలు

## ఉత్తరాంధ్రకు భోగాపురం ఎయిర్‌పోర్టు గేమ్ ఛేంజర్

**-రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు,**

**గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్థసారథి.**

**భోగాపురం,** : భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభంతో ఉత్తరాంధ్ర భవిష్యత్తు, ముఖచిత్రం పూర్తిగా మారిపోనుందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. అల్లూరి సీతారామరాజు భోగాపురం విమానాశ్రయం వద్ద మీడియాతో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధికి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఒక గేమ్ ఛేంజర్‌గా నిలుస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి,

ఉపాధి, రవాణా, పర్యాటకం, సాంస్కృతిక అభివృద్ధికి దోహదపడే అనేక ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మూడు లక్షలకు పైగా ప్రజలు హాజరుకానున్న నేపథ్యంలో వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ప్రజల రాకపోకలకు ఇప్పటికే వేల బస్సులను ఏర్పాటు చేశామని, ప్రజా ప్రతినిధులు కూడా తమ సొంత వాహనాలతో పాటు మినీ బస్సులను ఏర్పాటు చేస్తున్నారని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడి చేతులమీదుగా రూ. 17,900 కోట్ల ప్రాజెక్టులకు ప్రారంభం కానున్నాయన్నారు. ప్రధాన మంత్రి భోగాపురం పర్యటనకు వస్తున్న నేపథ్యంలో కార్యక్రమ ఏర్పాట్లను ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని మంత్రి తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవం, ఉత్తరాంధ్ర అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించేందుకు సమాచార,పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో భారీ ప్రచార కార్యక్రమాలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. శ్రీకాకుళం,విజయనగరం, విశాఖపట్నం నగరాల్లో సుమారు 200 హోర్డింగ్స్, 50 ఎల్ఈడీ స్క్రీన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేకంగా డ్రోన్ల ద్వారా కూడా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇందుకోసం 5 డ్రోన్లను ఏర్పాటు చేశామని తెలిపారు. అదేవిధంగా డిజిటల్,సోషల్ మీడియా వేదికల ద్వారా భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రాధాన్యత, ఉత్తరాంధ్రకు రానున్న అభివృద్ధి అవకాశాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారని మంత్రి పార్థసారథి వివరించారు. విమానాశ్రయంతో ఎగుమతులకు కొత్త ఊపు లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు. భోగాపురంఎయిర్ పోర్టులో 25,000 మెట్రిక్ టన్నుల కార్గో సామర్థ్యం కలిగిన టెర్మినల్ అందుబాటు లోకి రావడంతో ఉత్తరాంధ్ర నుంచి దేశ, విదేశాలకు ఎగుమతులు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ విమానాశ్రయం ద్వారా ఈ ప్రాంతంలో ఆర్థిక, సామాజిక, వాణిజ్య రంగాల్లో గణనీయమైన మార్పులు వస్తాయని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు, దేశాలకు వలస వెళ్లే ప్రాంతంగా ఉన్న ఉత్తరాంధ్ర, భవిష్యత్తులో ఇతర ప్రాంతాల వారికి కూడా ఉపాధి కల్పించే స్థాయికి ఎదుగు తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. విమానాశ్రయం ద్వారా ప్రపంచంలోని అనేక ప్రాంతాలకు మెరుగైన కనెక్టివిటీ ఏర్పడి, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింత విస్తరిస్తాయని తెలిపారు.

పోలవరం నీటితో ఉత్తరాంధ్రకు మరింత ప్రయోజనం కలుగుతుందని ఆగస్టు 14 న పోలవరం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ నుంచి ఉత్తరాంధ్రకు నీటిని తీసుకువచ్చే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. సాగు నీరు, తాగు నీరు, పరిశ్రమలు, వ్యవసాయ రంగాలకు ఈ కార్యక్రమం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పారు. పాత్రికేయుల సమావేశం లో సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కెఎస్. విశ్వనాథన్ తదితరులు పాల్గొన్నారు.

## మీ రాక కోసం ఎదురుచూస్తున్నాం మోదీజీ

**ప్రధాని ట్వీట్‌ను రీ ట్వీట్ చేసిన చంద్రబాబు**

**అమరావతి** : ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలవనున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. విజయనగరం జిల్లా భోగాపురం మండలంలో నిర్మితమైన ఈ విమానాశ్రయాన్ని ఆగస్టు 1న శనివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. 'రేపు భోగాపురం ఎయిర్‌పోర్టును ప్రారంభిస్తున్నాం' అంటూ ఏపీ పర్యటనపై ఎక్స్‌లో ప్రధాని పోస్ట్ చేశారు. ఉత్తరాంధ్రకు మౌలిక సదుపాయాల కల్పనలో కీలక అడుగు పడుతోందని చెప్పారు. ప్రధాని పోస్ట్‌ను ట్రాక్ చేస్తూ సీఎం చంద్రబాబు రీ పోస్ట్ చేశారు. 'ఉత్తరాంధ్ర టేకాఫ్‌కు సిద్ధంగా ఉంది... మీ రాక కోసం ఎదురుచూస్తున్నాం మోదీ జీ' అంటూ పోస్టు చేశారు. ఉత్తరాంధ్ర కలలకు రెక్కలొచ్చాయని, ఉత్తరాంధ్రకు గేట్‌వేగా భోగాపురం ఎయిర్‌పోర్టు నిలుస్తుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఇక, ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు.

## భారీ వర్షాలతో ముంబదస్తు జాగ్రత్తలు

**గోదావరి వరదలపై జిల్లా యంత్రాంగం అప్రమత్తం**

**జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ వెల్లడి**

**కోనసీమ,** : గోదావరి వరదలపై జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉందని కలెక్టర్ మహేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. రాత్రికి ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందన్నారు. సుమారు 10 లక్షల క్యూసెక్కుల నీటి విడుదల చేయనున్నట్లు తెలిపారు. అలాగే, రేపు సాయంత్రానికి రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయ్యే అవకాశం ఉందని చెప్పారు. సుమారు 13 లక్షల క్యూసెక్కుల నీటి విడుదల ఉండొచ్చని అంచనా వేశారు. జిల్లాలోని 19 మండలాలపై వరద ప్రభావం ఉందని కలెక్టర్ వెల్లడించారు. సెంట్రల్ డెల్టా పరిధిలోని 16 - 17 మండలాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. 32 లంక గ్రామాలు వరద ప్రభావానికి గురయ్యే అవకాశం ఉందని చెప్పారు. బోట్లు, లైఫ్ జాకెట్లు, సహాయక బృందాలు సిద్ధంగా ఉన్నాయని, వరద ప్రభావం నేపథ్యంలో జిల్లా అధికారుల సెలవులను మూడు, నాలుగు రోజుల పాటు రద్దు చేసినట్లు తెలిపారు. నీటిమట్టం అంతకంతకూ పెరుగుతున్నందున గోదావరిలోకి ఎవరూ దిగవద్దని ప్రజలకు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. పడవ ప్రయాణాలపై తాత్కాలిక ఆంక్షలు విధించామని, ప్రత్యామ్నాయ మార్గాలు వినియోగించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో జిల్లా కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని కలెక్టర్ మహేష్ కుమార్ పేర్కొన్నారు.

## మీ కుతంత్రాలతో అభివృద్ధిని అడ్డుకోలేరు

**భోగాపురం విమనాశ్రాయం ప్రారంభానికి సిద్ధం**

**జగన్‌కు ఎంపి పల్లా శ్రీనివాసరావు హెచ్చరిక**

**విశాఖపట్నం** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మరోసారి విరుచుకుపడ్డారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఆంధ్రాకు మణిహారమని గుర్తు పెట్టుకో జగన్ అని అన్నారు. భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు తెలిపారు. అభివృద్ధిని చూసి జగన్ ఓర్చుకోలేకపోతున్నారని విమర్శించారు. కేవలం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభానికి ఆటంకం కలిగించేందుకే విశాఖకు జగన్ వచ్చారని ఆరోపించారు. కుతంత్రాలతో అభివృద్ధిని ఆపలేరని పల్లా అన్నారు. రానున్న కాలంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనుందని వెల్లడించారు. గాజువాక నుంచి125, జిల్లా మొత్తం 5000 వేల బస్సుల్లో 5 లక్షల మంది ప్రజలు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రత్యేకంగా దర్శించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టును నిర్మించడం వల్ల అంతర్జాతీయంగా వ్యాపారస్థులు ఉత్తరాంధ్రకు రావడం అలాగే పరిశ్రమలు స్థాపించడానికి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, చెన్నై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ రావడం వల్ల ఎన్నో పరిశ్రమలు వచ్చాయని పల్లా శ్రీనివాసరావు తెలిపారు. రానున్న కాలంలో ఉత్తరాంధ్ర.. స్వర్ణాంధ్ర బాటలో వెళ్లి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించే అవకాశం ఉందన్నారు. ఇకపై ఉద్యోగరీత్యా, వ్యాపారరీత్యా ఉత్తరాంధ్ర నుంచి వలసలు ఆగుతాయని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

భోగాపురానికి ఎయిరిండియా షెడ్యూల్ ప్రకటన

అమరావతి,జులై 31(ఆర్ఎన్ఎ): ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించనున్న భోగాపురం ఎయిర్‌పోర్టులో ఆగస్టు 17 నుంచి విమానాల రాకపోకలు మొదలవుతాయి. ఈ నేపథ్యంలో ఎయిరిండియా

అక్టోబర్ 24 వరకు ఫ్లైట్ షెడ్యూల్‌ను ప్రకటించింది. హైదరాబాద్-భోగాపురం మధ్య రోజుకు 5 సర్వీసులు, బెంగళూరు-భోగాపురం మధ్య రోజుకు రెండు సర్వీసులతో పాటు, ఆది, శుక్రవారాలు మినహా మిగిలిన 5 రోజులు మరో సర్వీసును నడుపుతామన్నారు. విజయవాడ-భోగాపురం మధ్య రోజుకు 4 సర్వీసులు నడపనున్నట్లు ఎయిరిండియా తెలిపింది.

## ఓ గొప్ప నాయకుడిని కోల్పోయాం

**మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ నివాళి**

**వరంగల్ :** మాజీ ఎమ్మెల్యేపెద్ది సుదర్శన్ రెడ్డితో తెలంగాణ సమాజం గొప్ప ప్రజా నాయకుడిని కోల్పోయిందని మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ అన్నారు. సుదర్శన్ రెడ్డి మరణం పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణ ఉద్యమంలో ముందుండి పోరాడిన గొప్ప నాయకుడు అని, ఉద్యమ స్ఫూర్తిని గ్రామీణ స్థాయి వరకు తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి విశేష కృషి చేశాడన్నారు. ప్రజల కోసం, తెలంగాణ కోసం ఆయన చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. అనారోగ్యంతో ఆయన మరణించడం అత్యంత బాధాకరమని పేర్కొంటూ, తనతో ఉన్న సుదీర్ఘ రాజకీయ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన పోషించిన పాత్రను ఎన్నటికీ మరువలేమన్నారు. ప్రజా జీవితంలో నిబద్ధత, నిరాడంబరత, ఉద్యమ పట్ల అంకితభావంతో పనిచేసిన పెద్ది సుదర్శన్ రెడ్డి సేవలు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

## భద్రాద్రి వద్ద గోదావరి ఉగ్రరూపం

**భారీగా వచ్చి చేరుతున్న వరదనీరు**

**భద్రాద్రి కొత్తగూడెం :** భద్రాచలం వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో గోదావరిలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. శుక్రవారం ఉదయం భద్రాచలం వల్ల గోదావరి నీటి మట్టం 44 అడుగులకు చేరింది. 9,74,666 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. దీంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. గోదావరి నీటిమట్టం పెరగడంతో కల్యాణకట్ట, స్నాన ఘట్టాలు పూర్తిగా వరద నీటిలో మునిగిపోయాయి. వరద ప్రవాహం కొనసాగుతుండ టంతో రాబోయే గంటల్లో నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికార వర్గాలు సూచించాయి. గోదావరి నీటి మట్టం అంతకంతకూ పెరుగుతుండటంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు రెవెన్యూ, విపత్తు నిర్వహణ అధికారులు సిద్ధంగా ఉన్నారు. ప్రజలు ఎవరూ కూడా గోదావరి వైపుకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరించారు.

## కాళేశ్వరం వద్ద గోదావరి ఉధృతి

కాళేశ్వరం,జూలై31(ఆర్ఎన్ఎ):ఎగువ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో కాళేశ్వరం వద్ద గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. శుక్రవారం ఉదయం 9:00 గంటలకు సీడబ్ల్యూసీ కాళేశ్వరం స్టేషన్ వద్ద గోదావరి నీటిమట్టం 11.50 మీటర్లకు చేరింది. ప్రస్తుతం ప్రాంతంలో వాతావరణం మేఘావృతంగా ఉంది. మేడిగడ్డలోని లక్ష్మీ బ్యారేజ్ వద్ద నీటిమట్టం 96.40 మీటర్లు నమోదైంది. బ్యారేజ్ వద్ద మొత్తం 8,35,800 క్యూసెక్కుల వరద ప్రవాహం ఇన్ఎ÷-లో, అవుట్ఎ÷-లోగా కొనసాగుతుండగా, వరద నీటిని దిగువకు విడుదల చేసేందుకు 85 గేట్లను పూర్తిగా ఎత్తి ఉంచారు. ప్రస్తుతం గోదావరి నది బ్యారేజ్ వద్ద ఫ్రీ ఎ÷-లో పరిస్థితిలో ప్రవహిస్తోంది. కాళేశ్వరం వద్ద హెచ్చరిక స్థాయి 12.210 మీటర్లు, ప్రమాద స్థాయి

13.460 మీటర్లుగా ఉండటంతో అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నది వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

## మౌళిక వసతుల కల్పనలో బిగ్ బూస్ట్

**అమరావతి,** : రేపే అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించబోతున్నట్లు సోషల్ మీడియాలో పోస్ట్ చేసారు ప్రధాని నరేంద్ర మోదీ. మౌళిక వసతుల కల్పనలో ఈ విమానాశ్రయం బిగ్ బూస్ట్ ఇస్తుందన్నారు. ప్రధాని సోషల్ మీడియా పోస్టుకు స్పందించిన సీఎం చంద్రబాబు రీ-పోస్ట్ చేసారు. ప్రధాని మోదీకి స్వాగతం పలికేందుకు సిద్దంగా ఉన్నామన్న ముఖ్యమంత్రి.భోగాపురం ఎయిర్ పోర్టుతో అభివృద్ధిలో ఉత్తరాంధ్ర టేకాఫ్ తీసుకుంటుందని పోస్ట్ చేసారు.

## బిఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది కన్నుమూత

**చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతి**

**అభిమాన నాయకుడు మరణంతో విషాదం**

**వరంగల్ :** తెలంగాణ ఉద్యమ కెరటం, కేసీఆర్ ప్రధాన అనుచరుడు, నర్సంపేట రైతుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన రైతు బాంధవుడు, ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ రాష్ట్ర సాధనలో తనదైన ముద్ర వేసి అందరి మన్ననలు పొందిన ఉద్యమ నేత, నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి ఇకలేరు. ఈ వార్తను నర్సంపేట ప్రజలే కాదు, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు సైతం జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ నెల 26న తీవ్రమైన గుండెపోటు రావడంతో వెంటనే హనుమకొండలోని రోహిణి ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి తరలించారు. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్, మరో మాజీ మంత్రి హరీశ్ రావు దగ్గరుండి హైదరాబాద్‌కు తరలించారు. గత ఐదు రోజులుగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున ఉదయం 12 గంటల 51 నిమిషాలకు కన్నుమూశారు. తమ అభిమాన నాయకుడు, ఉద్యమ సారథి పెద్ది సుదర్శన్ రెడ్డి ఇకలేరనే విషయాన్ని నర్సంపేటతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు నమ్మలేకపోతున్నారు. పెద్ది అకాల మరణం వరంగల్ జిల్లాలో విషాదాన్ని నింపింది. ఆయన మృతికి ఉమ్మడి వరంగల్‌తో పాటు యావత్ తెలంగాణ రాష్ట్ర ప్రజలంతా తమ నివాళులు అర్పిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నల్లబెల్లి మండలం నుంచి జడ్పీటీసీగా గెలుపొందిన పెద్ది సుదర్శన్ రెడ్డి, కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) టీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత కాంగ్రెస్‌కు రాజీనామా చేసి టీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమ నేత కేసీఆర్ వెంటే నడిచారు. తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన నాయకుల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పెద్ది సుదర్శన్ రెడ్డి మొదటి వరుసలో నిలిచారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ సాధన కోసం ప్రపంచ స్థాయిలో రికార్డు సృష్టించిన భారీ బహిరంగ సభను వరంగల్‌లోని ప్రకాశ్‌రెడ్డిపేటలో పెద్ది సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఆ రోజు నుంచి ఈ రోజు వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన ప్రధాన సభల బాధ్యతలను ఉద్యమ నేత కేసీఆర్ పెద్ది సుదర్శన్ రెడ్డికే అప్పగించేవారు. ఏల్కతుర్తిలో జరిగిన టీఆర్ఎస్ భారీ సభ కూడా ఆయన నిర్వహణలోనే జరిగింది.

అధికారంలో ఉన్నామా లేదా అనేది కాదు? ప్రజలకు ఏమి చేశామనేదే ముఖ్యం అనే భావనతో పనిచేసిన నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి. 2014లో నర్సంపేట నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయినప్పటికీ, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు సహకారంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నర్సంపేట నియోజకవర్గానికి దేవాదుల ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను తీసుకొచ్చి, పాకాల సరస్సును నింపి నర్సంపేట ప్రజల గుండెల్లో రైతు బాంధవుడిగా చిరస్మరణీయమైన ముద్ర వేశారు. మాదన్నపేట వాగుపై సిద్దాం నిర్మించి, నర్సంపేట నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా కృషి చేశారు. రైతు బాంధవుడిగా సుదర్శన్ రెడ్డి పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరి మనసులో చెరగని ముద్ర వేశారు.

## నర్సంపేటకు చేరుకున్న పెద్ద భౌతిక కాయం

**అభిమన నేతకు నివాళి కోసం భారీగా తరలివచ్చిన జనం**

**వరంగల్ :** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పెద్ది సుదర్శన్ రెడ్డి భౌతిక కాయం నర్సంపేటకు చేరుకుంది. ఆయన భౌతికకాయాన్ని సందర్శించేందుకు ప్రజలు, అభిమానులు, పార్టీ నాయకులు భారీగా తరలివచ్చారు. తమ అభిమాన నాయకుడిని చివరిసారిగా చూసి పలువురు భావోద్వేగానికి గురయ్యారు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో విషాదఛాయలు అలుముకున్నాయి. తీవ్ర అస్వస్థతతో సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో ఐదు రోజులుగా చికిత్స పొందుతున్న పెద్ది సుదర్శన్ రెడ్డి గురువారం అర్ధరాత్రి 12.50 గంటల తర్వాత తుదిశ్వాస విడిచారు. జూలై 26వ తేదీన ఉదయం హనుమకొండలోని తన నివాసంతో పెద్ది సుదర్శన్ రెడ్డి తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో తొలుత స్థానిక ఆస్పత్రికి, ఆ తర్వాత సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. వైద్యులు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ ఆయన్ను కాపాడలేకపోయారు. తెలంగాణ ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి కేసీఆర్ వెన్నంటే ఉన్నారు. వరంగల్ జిల్లా నుంచి తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. తెలంగాణ సాధనకు అండగా నిలిచిన ఆదర్శ నాయకుడైన సుదర్శన్ రెడ్డి, 1974 ఆగస్టు 6న ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నల్లబెల్లి గ్రామంలో జన్మించారు. ఆయన 2001లో తెలంగాణ రాష్ట్ర సమితి (ప్రస్తుతం బీఆర్ఎస్) తరపున జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం (జెడ్పీటీసీ) సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆయన 2004లో టీఆర్ఎస్ జిల్లా పార్టీ కన్వీనర్‌గా ఎన్నికై, ఆ తర్వాత 2002లో రాష్ట్ర పార్టీ కన్వీనర్‌గా నామినేట్ అయ్యారు. ఆయన ఎనిమిదేళ్లకు పైగా టీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహించి, ఆ తర్వాత పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా నామినేట్ అయ్యారు.

## నర్ంపేటలో భారీగా తరలివచ్చిన జనం

**రెండు కిలోమేటర్ల మేర ట్రాఫిక్ జామ్**

**వరంగల్ :** తెలంగాణ ఉద్యమ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డికి తుది వీడ్కోలు పలికేందుకు వేలాదిగా ప్రజలు నర్సంపేటకు తరలివచ్చారు. అభిమాన నాయకుడిని చివరిసారిగా చూసేందుకు జనం పోటెత్తడంతో పట్టణమంతా జనసంద్రంగా మారింది. పెద్ది అంతిమయాత్ర సందర్భంగా ప్రధాన రహదారులపై సుమారు రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించగా, ఎటు చూసినా పెద్ది అభిమానులే కనిపించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి పార్థివదేహం నర్సంపేటకు చేరుకున్నప్పటి నుంచి పట్టణంలోని వీధులు జనంతో కిక్కిరిసిపోయాయి. చిన్నా, పెద్దా తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలు తమ అభిమాన నాయకుడికి చివరి వీడ్కోలు పలికేందుకు బారులు తీరారు. అభిమానుల రద్దీతో నర్సంపేట ప్రధాన రహదారులపై సుమారు రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. వాహనాలు నెమ్మదిగా కదలడంతో పోలీసులు ప్రత్యేక ట్రాఫిక్ ఏర్పాట్లు చేశారు. పెద్ది దర్శన్ రెడ్డి పార్థివదేహాన్ని చూసిన పలువురు అభిమానులు భావోద్వేగానికి లోనై కన్నీటి పర్యంతమయ్యారు. 'మా నాయకుడు ఇక లేరు' అంటూ విలపించారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నాయకుడికి తుది వీడ్కోలు పలికేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. నర్సంపేటలో ఎటు చూసినా శోకసంద్ర వాతావరణమే కనిపించింది. అభిమానుల రోదనలు, నివాళులతో పట్టణం అంతా విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రజల ప్రేమాభిమానాలకు ప్రతీకగా వేలాది మంది స్వచ్ఛందంగా తరలివచ్చి తమ ప్రియ నేతకు అశ్రు నివాళులు అర్పించారు.

# నకిలీ బంగారంతో బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలను మోసం చేసిన ముఠా అరెస్ట్

- సిఐ సాగర్

సింగరేణి ప్రతినిధి: (జన సంఘర్షణ) న్యూస్

ఖమ్మం జిల్లా కారేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ బంగారు ఆభరణాలను తయారు చేసి బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలను, గోల్డ్ కొనుగోలు సంస్థలను మోసం చేస్తున్న ముఠాను కారేపల్లి ఎస్సై గోపి ఆధ్వర్యంలో అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు సింగరేణి సర్కిల్ ఇన్స్పెక్టర్ సాగర్ తెలిపారు. ఈ కేసులో ఇప్పటివరకు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేయగా, మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం... నిందితులు రాగితో ఆభరణాలను తయారు చేసి వాటిపై బంగారు పూత పూసి అసలైన బంగారంలా కనిపించేలా తయారు చేసేవారని, అనంతరం ఆ నకిలీ ఆభరణాలను వివిధ బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల్లో తాకట్టు పెట్టి రుణాలు పొందడంతో పాటు, ప్రైవేట్ గోల్డ్ కొనుగోలు సంస్థలను సైతం మోసం చేసి అక్రమంగా డబ్బు సంపాదించినట్లు విచారణలో తేలిందన్నారు. ఇదే క్రమంలో రాంచందర్ యొక్క ఏజెంట్ అయిన సునీల్ తో ఇల్లందు ముత్తూట్ ఫైనాన్స్ లో 52 గ్రాముల బంగారం పెట్టించి 3.90 లక్షలు తీసుకున్నారని పేర్కొన్నారు. దానిని రిలీజ్ చేయించడానికి ప్లాన్ చేసి హైదరాబాద్ లోని "మన గోల్డ్ కంపెనీ ని సంప్రదించి వారియొక్క ప్రతినిధి ద్వారా 5.80 లక్షలు సునీల్ తీసుకొని మోసం చేసి పారిపోయారని వివరించారు. అట్టి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నిందితులను కారేపల్లి పోలీసులు అరెస్ట్ చేశారని తెలిపారు. ఈ కేసులో అరెస్టయిన నిందితుడి నుండి నేరం ద్వారా సంపాదించిన సొమ్ముతో కొనుగోలు చేసిన తెలుపు రంగు వేర్నా కారు (రిజిస్ట్రేషన్ నం. టి ఎస్04బి ఏ2616), రూ.15,000 నగదు, అలాగే నేరాలకు ఉపయోగించిన ఐ క్యూ కంపెనీ మొబైల్ ఫోన్ ను కారేపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు.

**అరెస్టు అయిన నిందితులు:** గుగులోత్ సునీల్ కుమార్, R/o. భాగ్యనగర్, కారేపల్లి. 2)ముందాడా రాంచందర్, R/o. కారేపల్లి. పరారీలో ఉన్న నిందితుడు దారవత్ రాకేష్, R/o. సూర్యతండా, కారేపల్లి.

ఈ కేసులో ప్రమేయం ఉన్న ఇతర వ్యక్తుల




పాత్రపై కూడా దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. ఈ కేసులో విచారణ అధికారి కారేపల్లి ఎస్సై గోపి, సహకరించిన కామేపల్లి ఎస్సై శ్రీకాంత్ ను అభినందిచారు.

**ప్రజలకు విజ్ఞప్తి:** బంగారం తాకట్టు పెట్టే ముందు లేదా కొనుగోలు చేసే ముందు సంబంధిత ఆభరణాల స్వచ్ఛతను తప్పనిసరిగా పరీక్షించుకోవాలని, అనుమానాస్పద లావాదేవీలు లేదా వ్యక్తుల గురించి సమాచారం ఉంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్ కు తెలియజేయాలని, అదేవిధంగా ఎవరైనా బాధితులు ఉంటే సంప్రదించగలరని సిఐ ప్రజలను కోరారు.

# పుష్పుల వాగు ప్రమాదకరం

- బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు.
- వెంటనే రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చేయాలి బిజెపి డిమాండ్.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 31 (జన సంఘర్షణ)

మెదక్ జిల్లా రామాయంపేట మండలం పర్వతాపూర్ పుష్పులవాగు బ్రిడ్జికి శాశ్వత నిర్మాణం చేపట్టాలి.రైతులకు తక్షణ నష్టపరిహారం చెల్లించాలి. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, దంతపల్లి సర్పంచ్ బాల్‌రాజ్, రామాయంపేట మండలం పర్వతాపూర్ గ్రామ సమీపంలోని పుష్పులవాగు బ్రిడ్జిని భారతీయ జనతా పార్టీ బృందం శుక్రవారం పరిశీలించింది. గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు పుష్పులవాగు బ్రిడ్జి ఇరువైపులా పూర్తిగా కొట్టుకుపోవడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.ఈ ఘన వల్ల పరిసర ప్రాంతాల ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.భారీ వరదల కారణంగా వందల ఎకరాల్లో వరి పంట కొట్టుకుపోయి, పొలాల్లో ఇసుక మెట్టలు పేరుకుపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం అందజేస్తామని ప్రకటించినప్పటికీ, ఏడాది గడిచినా ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడం అత్యంత దురదృష్టకరం, సిగ్గుచేటు. తాత్కాలికంగా రాకపోకలు పునరుద్ధరించేందుకు బ్రిడ్జి ఇరువైపులా మట్టిని నింపినప్పటికీ, ఆ పనులు చేసిన కాంట్రాక్టర్లు, వ్యక్తులకు ఇప్పటి వరకు ఒక్క రూపాయి బిల్లు కూడా చెల్లించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి





నిదర్శనం. గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో బ్రిడ్జి పరిస్థితిని పరిశీలించిన బీజేపీ బృందం అక్కడి పరిస్థితులను పంచాయతీరాజ్ డీఈ దృష్టికి ఫోన్ ద్వారా తీసుకెళ్లింది. గత సంవత్సరం నుంచే జిల్లా కలెక్టర్, పంచాయతీరాజ్ అధికారులు, ఏఈలకు పలుమార్లు వినతిపత్రాలు అందజేసి, శాశ్వత నిర్మాణం చేపట్టాలని కోరినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. లక్ష్మాపూర్,పర్వతాపూర్,కిషన్ తండా,దంతపల్లి రహదారులు పూర్తిగా దెబ్బతిని భారీ గుంతలతో ప్రమాదకరంగా మారాయి.చిన్న వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గత మూడు రోజుల క్రితం ఆర్టీసీ డీఎం స్వయంగా పరిశీలించి, రోడ్ల దుస్థితి కారణంగా బస్సు సర్వీసులను నిలిపివేశారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బస్సులు నడపాలని కోరినా,ప్రస్తుతం ఉన్న ప్రమాదకర పరిస్థితుల్లో బస్సులు నడపడం సాధ్యం కాదని అధికారులు స్పష్టం చేశారు. గత సంవత్సరం నుంచే మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్ రావు ద్వారా జిల్లా కలెక్టర్, డీఈ, ఏఈలకు పలుమార్లు ఈ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేసినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి కనిపించలేదు. ప్రస్తుతం మరోసారి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బ్రిడ్జి మరింత ప్రమాదకర స్థితికి చేరుకుంది.అందువల్ల ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి: పర్వతాపూర్ పుష్పులవాగు బ్రిడ్జికి శాశ్వత నిర్మాణం చేపట్టాలి.బ్రిడ్జి ఇరువైపులా రక్షణ గోడలు, శాస్త్రీయ నిర్మాణాలు ఏర్పాటు చేయాలి. లక్ష్మాపూర్–పర్వతాపూర్–కిషన్ తండా–దంతపల్లి రహదారులపై ఉన్న గుంతలను అత్యవసరంగా పూడ్చి రాకపోకలను సురక్షితంగా చేయాలి. గత సంవత్సరం వరదల వల్ల నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలి. తాత్కాలిక మరమ్మతుల పనులు చేసిన వారికి పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలి. లేనిపక్షంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు, దంతపల్లి సర్పంచ్ బాల్‌రాజ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

- ఆపరేషన్ ముస్కాన్‌లో నెల రోజుల్లో 112 మంది బాలల రెస్క్యూ.
- 75 కేసులు నమోదు బాల కార్మికులను పనిలో పెట్టుకునే వారిపై కఠిన చర్యలు.
- అన్ని శాఖల సమన్వయంతో బాల కార్మికుల నిర్మూలనకు కృషి.
- మెదక్ అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 31 (జన సంఘర్షణ)

రాష్ట్రవ్యాప్తంగా జూలై 1వ తేదీన ప్రారంభమైన ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం నెల రోజుల పాటు మెదక్ జిల్లాలో అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా కొనసాగిందని మెదక్ అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్ ముగింపు కార్యక్రమంలో భాగంగా శు క్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అదనపు ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై బాల కార్మికుల నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా జిల్లాలోని హోటళ్లు, ఇటుక బట్టీలు,నిర్మాణ ప్రాంతాలు, వ్యాపార సముదాయాలు తదితర ప్రాంతాల్లో పనిచేస్తున్న బాల కార్మికులను గుర్తించి రక్షించడం జరిగింది. రక్షించిన బాలలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపరిచి, వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించిన






అనంతరం తల్లిదండ్రులకు లేదా సంరక్షణ కేంద్రాలకు అప్పగించడం జరిగిందని తెలిపారు.నెల రోజుల వ్యవధిలో జిల్లావ్యాప్తంగా 112 మంది బాలలను రక్షించి, వారి తల్లిదండ్రులకు లేదా సంరక్షణ కేంద్రాలకు అప్పగించడం జరిగిందన్నారు. బాల కార్మికులను పనిలో ఉంచుకున్న యజమానులపై 75 కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పిల్లల బాల్యం బదులకు అంకితం కావాలని, వారు కార్మికులుగా పనిచేయకుండా విద్యను అభ్యసించి తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకునేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని అదనపు ఎస్పీ సూచించారు. బాల కార్మికులను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని, ఇకపై కూడా బాల కార్మికులను పనిలో పెట్టుకునే యజమానులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం నెల రోజుల పాటు పోలీస్ శాఖతో పాటు కార్మిక, విద్య, మహిళా శిశు సంక్షేమ, వైద్య ఆరోగ్య, రెవెన్యూ తదితర శాఖల సమిష్టి కృషితో విజయవంతంగా కొనసాగిందన్నారు. బాల కార్మికుల నిర్మూలన కోసం ఇదే సమన్వయంతో భవిష్యత్తులో కూడా నిరంతరం చర్యలు కొనసాగిస్తామని తెలిపారు. బాలల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసే విధంగా మెదక్ జిల్లా పోలీస్ శాఖ అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ నిరంతరం కృషి చేస్తుందని అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ రాజశేఖర్ రెడ్డి, సీడబ్ల్యూసీ సభ్యుడు ఉప్పలయ్య, హెల్త్ డిపార్ట్‌మెంట్ డాక్టర్ నవ్య డీసీపీయూ ఇన్‌చార్జి నాగరాజు, ఏఎల్‌ఓ మెదక్ కమృద్దీన్, తిరుపతి, ఏఎల్‌ఓ నర్సాపూర్ సత్యేంద్ర ప్రసాద్, మిషన్ ఎన్జీవో సిబ్బంది, రెండు డివిజన్లకు చెందిన ఆపరేషన్ ముస్కాన్ బృందాల సభ్యులు పాల్గొన్నారు.

# మాటల్లో కాదు... చేతల్లో మానవత్వం

- దహన సంస్కారాలకు రూ.5,000 సాయం

సింగరేణి ప్రతినిధి: (జన సంఘర్షణ) న్యూస్



సింగరేణి మండలంలోని బజ్యతండ గ్రామానికి చెందిన అజ్మీరా లక్ష్మి మృతి చెందిన విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ వాంకుడోత్ హనుమంతరావు శుక్రవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన ఆయన, ఈ కష్టకాలంలో గ్రామపంచాయతీ తరఫున, వ్యక్తిగతంగా తమ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం దహన సంస్కారాల నిర్వహణ కోసం రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూరి రాంబాబు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సురపురెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, మండల నాయకులు అజ్మీరా నరేన్, హేమ్లా, సామా, శంకర్, రవి, చిట్టిబాబు, చందర్, భద్రూ, సొమ్లు, సురేష్, అజ్మీరా నారాయణ తదితరులు పాల్గొని మృతురాలికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

# మంచి స్నేహితుడిని కోల్పోయా

- పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి తెలంగాణ రాజకీయాలకు తీరని లోటు: లావుడియా రాములు నాయక్

సింగరేణి ప్రతినిధి: (జన సంఘర్షణ) న్యూస్



నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆకస్మిక మరణం పట్ల వైరా మాజీ ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసిన నాయకుడిని, ఎంతోకాలంగా తనకు సన్నిహిత మిత్రుడిని కోల్పోవడం ఎంతో బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన ప్రజానాయకుడిగా చిరస్థాయిగా గుర్తుండిపోతారని అన్నారు. ఆయన మరణం తెలంగాణ రాజకీయాలకు తీరని లోటని పేర్కొన్న రాములు నాయక్, పెద్ది సుదర్శన్ రెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. అలాగే వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు.

# నరేంద్రమోడీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై గ్రామ గ్రామాన విస్తృత ప్రచారం

- సీఐటీయూ, ఏఐకే ఎస్, ఏఐఏ ఉమామేన్స్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, జులై 31(జనసంఘర్షణ):




నరేంద్రమోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగష్టు 10న జరిగే జైల్ భరో కార్యక్రమం జయప్రదం చేయాలని, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బందెల చంటి, రైతు సంఘం మండల కార్యదర్శి నల్లగట్ల నర్సింహమూర్తి,ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం నాడు మండల వ్యాప్తంగా గ్రామ గ్రామాన విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పోరేట్లకు కట్టబెడుతున్నారని విమర్శించారు.( పజల ఓట్లతో గెలిచి ప్రజా సంపదను దోచుకుంటున్న మోడీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల ప్రయోజనం కోసం 29 కార్మిక చట్టాలను మార్చిందన్నారు. కార్మిక చట్టాలను మార్చడం వల్ల ఎనిమిది గంటల పని హక్కు,ఉద్యోగ భద్రత,కనీస వేతన చట్టం, సంఘం పెట్టుకునే హక్కులను హరిస్తుందని విమర్శించారు. అదేవిదంగా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరల చట్టం చేయాలని రైతులు కోరుతున్నా కేంద్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర చట్టం చేయడం లేదని విమర్శించారు. దేశంలో ఉన్న రైతాంగానికి నష్టం కలిగించే విధంగా అమెరికాతో వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నారని తెలిపారు. పత్తి, మొక్కజొన్న, పాడి ఉత్పత్తులను, కోడి కాళ్ళను దిగుమతి చేసుకోవడానికి జరిగిన ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి గ్రామీణ పేదలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకు వచ్చిన వీబీజీరామ్ జి చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.అదేవిదంగా నూతన విత్తన చట్టం, నూతన విద్యుత్ చట్టాలను తెచ్చి ప్రజలపై భారాలు మోపుతుందన్నారు. బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఆగష్టు 10వ తేదీన క్విట్ ఇండియా స్పూర్తితో జైల్ భరో కార్యక్రమం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# మున్సిపాలిటీలో రైన్ కోట్స్ పంపిణీ చేసిన చైర్మన్

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 31 (జన సంఘర్షణ)

మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపాలిటీలో పని చేసే పరిశు ద్ధకార్మికులకు వర్షాకాలం సందర్భంగా వర్షం లో విధులు నిర్వహించడం ఇబ్బంది అవుతుంది కావున కార్మికులకు మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజు, కమీషనర్ రవీందర్ కలిసి రైన్ కోట్స్ ఇవ్వడం జరిగింది. వారు మాట్లాడుతూ కార్మికుల సేవలను అభినందిస్తూ, ఎల్లప్పుడూ వారి సంక్షేమానికి కట్టుబడి ఉంటుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్పెక్టర్ వనిత, వైస్ చైర్మన్,కౌన్సిలర్స్, కో ఆప్షన్ మెంబెర్స్,మున్సిపల్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.



జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం · తెలుగు దినపత్రిక

శనివారం
01 ఆగస్టు 2026

# 9 మందిపై ఈ-పెట్టీ కేసులు..46 అవగాహన కార్యక్రమాలు

- వేధింపులకు గురైతే వెంటనే షీ టీంను సంప్రదించండి
- ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 31 (జన సంఘర్షణ)

మహిళలు, బాలికల భద్రతకు మెదక్ జిల్లా పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, తెలిపారు. మహిళలపై వేధింపులు, ఈవ్‌టీజింగ్, అసభ్య ప్రవర్తన, సైబర్ వేధింపులపై షీ టీం నిరంతరం నిఘా కొనసాగిస్తోందన్నారు. జూలై నెలలో షీ టీం నిర్వహించిన ప్రత్యేక తనిఖీలు, నిఘా చర్యల్లో 77 మందిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన 9 మందిపై ఈ-పెట్టీ కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. మహిళలు, బాలికల్లో చట్టాలపై అవగాహన పెంపొందించేందుకు జిల్లా వ్యాప్తంగా 46 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు ఎస్పీ తెలిపారు. విద్యాసంస్థలు, ప్రజా ప్రదేశాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో మహిళల భద్రత, అత్యవసర సేవలు, షీ టీం సేవలు, సైబర్ నేరాల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. మహిళలు, బాలికలు ఎలాంటి వేధింపులకు గురైనా భయపడకుండా వెంటనే షీ టీం లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్పీ సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచడంతో పాటు బాధితులకు తక్షణ సహాయం అందించి, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహిళలు, బాలికల భద్రతకు ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. ఎక్కడైనా వేధింపుల సంఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. మహిళలు, బాలికలకు సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు షీ టీం ద్వారా నిఘా, అవగాహన




కార్యక్రమాలు, చట్టపరమైన చర్యలు నిరంతరం కొనసాగుతాయని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు.

# యువశక్తే బీఆర్ఎస్‌కు బలం

- ప్రజా సేవలో యువత ముందుండాలి.
- పార్టీ బలోపేతంలో యువత పాత్ర కీలకం.
- మావురం రాజుకు జన్మదిన శుభాకాంక్షలు
- బిఆర్ఎస్ నాయకులు కంఠరెడ్డి తిరుపతిరెడ్డి.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 31 (జన సంఘర్షణ)



బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి యువతే ప్రధాన శక్తి అని, ప్రజా సేవే యువ నాయకుల లక్ష్యంగా ఉండాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కంఠరెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. మెదక్ జిల్లా నిజాంపేట్ మండల బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు మావురం రాజు జన్మదిన వేడుకలను హైదరాబాద్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కంఠరెడ్డి తిరుపతిరెడ్డి మావురం రాజుతో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో సన్మానించి పార్టీ కోసం ఆయన అందిస్తున్న సేవలను అభినందించారు. గ్రామస్థాయిలో పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో, ప్రజా సమస్యల పరిష్కారంలో మావురం రాజు చురుకైన పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. యువశక్తి చైతన్యంతోనే సమాజంలో



సానుకూల మార్పులు సాధ్యమవుతాయని పేర్కొన్న ఆయన.. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాల్లో ముందుండాలని యువతకు సూచించారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే వారికి భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు లభిస్తాయని, మావురం రాజు పార్టీకి, ప్రజలకు మరింత విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షించారు. పార్టీ శ్రేణులంతా ఐక్యంగా కృషి చేస్తే బీఆర్ఎస్ మరింత బలోపేతం అవుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. అనంతరం పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మావురం రాజుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ పిఎసిఎస్ చైర్మెన్ పప్పుల బాపురెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కసిరెడ్డి మాణిక్య రెడ్డి, ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మెన్ బాలాగౌడ్, పాపన్నపేట్ మాజీ మార్కెట్ చైర్మెన్ వెంకట్రామిరెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు కొత్తూరి. శ్రీనివాస్ బిఆర్ఎస్వి నియోజకవర్గ నాయకులు గంజి నవీన్, రాజక్పల్లి సర్పంచ్ కనకరాజు, నాయకులు సాంగు స్వామి, రవి సెట్, మోహన్ రెడ్డి, నరేందర్, పరిశరములు, మధవత్ రాజు, వార్డు మెంబర్ పంపర నగేష్, నాస్కల్ ఏలం యాదవ్, బన్నీ, సాయి పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లాలో ఆగస్టు 1 నుంచి పోలీస్ యాక్ట్ అమలు

- ధర్నాలు, రాస్తారోకోలకు ముందస్తు అనుమతి తప్పనిసరి.
- ప్రజా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం చేస్తే కఠిన చర్యలు.
- మెదక్ జిల్లా ఎస్పీ. డి. వి శ్రీనివాస రావు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 31 (జన సంఘర్షణ)




మెదక్ జిల్లా శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా ఆగస్టు 01 నుండి 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్ 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు తెలిపారు. ఈ సమయంలో పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ఏవిధమైన ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్స్, సభలు, సమావేశాలు నిర్వహించడం నిషేధమని జిల్లా ఎస్పీ తెలిపారు. అలాగే ప్రజల/ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే చట్టవ్యతిరేక చర్యలు, అశాంతి సృష్టించే ప్రయత్నాలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. శాంతి భద్రతల నిర్వహణలో ఎవరైనా విఘాతం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఈ విషయంలో పోలీసులు చేపడుతున్న చర్యలకు సహకరించాలని జిల్లా ఎస్పీ గారు విజ్ఞప్తి చేశారు.

## ఉద్యమ యోధుడి మృతి తీరని లోటు

- పెద్ది సుదర్శన్ రెడ్డి సేవలు చిరస్మరణీయం.
- మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 31 (జన సంఘర్షణ)



తెలంగాణ ఉద్యమకారులు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది. సుదర్శన్ రెడ్డి మృతి తెలంగాణ సమాజానికి తీరని లోటని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి పోషించిన పాత్ర చిరస్మరణీయమని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేసిన నాయకుడిగా ఆయన ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. ఆయన మరణం బీఆర్ఎస్ పార్టీతో పాటు తెలంగాణ ప్రజలకు తీరని లోటని తెలిపారు. పెద్ది సుదర్శన్ రెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## కుల వివక్ష నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- హక్కులను గౌరవించాలి.. వివక్షకు వ్యతిరేకంగా పోరాడాలి
- వర్ని తహసీల్దార్ ప్రశాంత్ కుమార్

వర్ని, జూలై 31 (జన సంఘర్షణ):



సమాజంలో ప్రతి ఒక్కరి హక్కులను గౌరవిస్తూ, కుల వివక్షకు తావులేకుండా సమానత్వంతో ముందుకు సాగాలని వర్ని తహసీల్దార్ బీ. ప్రశాంత్ కుమార్ పిలుపునిచ్చారు. పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా గురువారం వర్ని మండలంలోని వర్ని గ్రామంలో గ్రామస్తులతో కలిసి స్థానిక సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో కుల వివక్షను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని సూచించారు. ప్రతి వ్యక్తి రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగేందుకు తోటి వారు సహకరించాలన్నారు. ఇతరుల హక్కులకు భంగం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ తమ హక్కులపై అవగాహన కలిగి ఉండటంతో పాటు, ఇతరుల హక్కులను కూడా గౌరవించాలని అన్నారు. కుల, మత, వర్ణ భేదాలు, వివక్ష, అంటరానితనం వంటి సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు అందరూ ఐక్యంగా ముందుకు రావాలని తహసీల్దార్ ప్రశాంత్ కుమార్ కోరారు. సమాజంలో ప్రతి ఒక్కరినీ సమానంగా చూడటం ద్వారా మాత్రమే నిజమైన సామాజిక సమానత్వం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆనంద్, సంక్షేమ వసతి గృహ అధికారి శిరీషతో పాటు వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పోతంగల్ సబ్‌స్టేషన్‌లో వాటర్ సమస్య.. అధికారుల దృష్టికి!

పోతంగల్/జూలై 31/( జనసంఘర్షణ):



పోతంగల్ సబ్‌స్టేషన్‌లో వాటర్ సమస్య కారణంగా సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సమాచారం. విద్యుత్ సేవల నిర్వహణలో కీలకంగా పనిచేసే సబ్‌స్టేషన్‌లో కనీస వసతులు అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బందికి తాగునీరు, అవసరమైన నీటి సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది. వాటర్ వంటి ప్రాథమిక సౌకర్యం కూడా లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారకూడదు. వెంటనే సమస్యను గుర్తించి వాటర్ సప్లై ఏర్పాటు చేయడంతో పాటు, సబ్‌స్టేషన్‌లో అవసరమైన మౌలిక వసతులను కల్పించాలని సిబ్బంది, స్థానికులు కోరుతున్నారు. ప్రజలకు, సిబ్బందికి ఇబ్బందులు కలగకుండా అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

## ఎస్‌జీఎఫ్‌ఐ (అండర్ 19) సెక్రటరీని నియమించాలని డీఐఈఓకు వినతిపత్రం అందజేత

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 31 (జన సంఘర్షణ)




మెదక్ జిల్లాకు అండర్-19 ఎస్‌జీఎఫ్ఐ జిల్లా సెక్రటరీని తక్షణమే నియమించాలని తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు జిల్లా విద్యాశాఖ అధికారి (డీఐఈఓ)కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర పునర్విభజన అనంతరం సిద్ధిపేట, సంగారెడ్డి జిల్లాల్లో అండర్-19 ఎస్‌జీఎఫ్ఐ జిల్లా సెక్రటరీలను నియమించి క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ, మెదక్ జిల్లాలో ఇప్పటివరకు సెక్రటరీని నియమించకపోవడం వల్ల క్రీడా కార్యకలాపాల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరోపించారు. ఎస్‌జీఎఫ్ఐ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన ప్రభుత్వ ఫిజికల్ డైరెక్టర్ లేదా ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుడిని మెదక్ జిల్లా అండర్-19 ఎస్‌జీఎఫ్ఐ సెక్రటరీగా వెంటనే నియమించాలని కోరారు. విద్యార్థుల క్రీడా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈవిషయంపై తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు, జిల్లా కార్యదర్శి మధు, రాష్ట్ర కార్యదర్శి మాధవరెడ్డి, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు విజయ్ కృష్ణ, గజేంద్రుల నర్సింలు, బసవరాజ్, కృష్ణ, శోభ, శృతి, గీతతో పాటు పలువురు ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## బోధన్ ప్రభుత్వ ఆసుపత్రి ముందు స్టాఫ్ నర్సుల నిరసన...

బోధన్/, జూలై 31:/(జన సంఘర్షణ)




బాన్సువాడ ఏరియా ఆసుపత్రిలో కాన్పుల ఆపరేషన్ల అనంతరం కొందరు బాలింతలు ఇన్ఫెక్షన్‌కు గురైన ఘటన నేపథ్యంలో ప్రభుత్వం ఇద్దరు స్టాఫ్ నర్సులను సస్పెండ్ చేసిన విషయానికి నిరసనగా శుక్రవారం బోధన్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ముందు స్టాఫ్ నర్సులు, వైద్య సిబ్బంది ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నిరసనకారులు మాట్లాడుతూ.. ఘటనకు స్టాఫ్ నర్సులే పూర్తిగా బాధ్యులు కాదని, సమగ్ర విచారణ జరపకుండా సస్పెన్షన్ చర్యలు తీసుకోవడం సరైంది కాదని అభిప్రాయపడ్డారు. సస్పెండ్ చేసిన ఇద్దరు స్టాఫ్ నర్సులను వెంటనే విధుల్లోకి పునర్నియమించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరసనలో పాల్గొన్న నర్సులు, వైద్య సిబ్బంది తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ నినాదాలు చేశారు. పూర్తి స్థాయి విచారణ అనంతరం మాత్రమే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

## ప్రతి ఓటరు ఓటు హక్కు నమోదును తప్పనిసరిగా చేసుకోవాలి

- ఓటు హక్కు వివరాలను తెలుసుకోవడం చాలా సులభం.
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమసింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 31 (జన సంఘర్షణ)



ఓటు హక్కు నమోదును 1950 నంబర్ కు మెసేజి చేయడం ద్వారా ఓటు నమోదు వివరాలు తెలుసుకోవడం ఇప్పుడు చాలా సులభమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్ ప్రక్రియ ముగింపు ఆగస్టు 3వ తేదీతో ముగియనున్నదని తెలిపారు. మూడు రోజులు వ్యవధి మాత్రమే ఉన్నందున ప్రతి ఓటరు తమ ఎన్నికల గుర్తింపు కార్డు ఈసీఐ (ఈ పి ఐ సి) నంబర్‌ను టైప్ చేసి 1950 నంబర్‌కు ఎస్ఎంఎస్ పంపడం ద్వారా తమ ఓటు వివరాలను మొబైల్ ఫోన్‌కు సందేశం రూపంలో పొందవచ్చని వివరించారు. ఈ సౌకర్యాన్ని అందరూ వినియోగించుకుని తమ ఓటు హక్కును నిర్ధారించుకోవాలని, అవసరమైతే సవరణలు, నమోదు ప్రక్రియలను సమయానికి పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రజలు ఓటు హక్కు విలువను గుర్తించి తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఆయన కోరారు.

# మెదక్ రాజకీయాల్లో భారీ సంచలనం!

◆ **బీఆర్ఎస్‌కు మెదక్ జిల్లాలో భారీ షాక్..!**



ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 31(జన సంరక్షణ)

మెదక్ మున్సిపాలిటీకి చెందిన 5 మంది కౌన్సిలర్లు, రామాయంపేట మున్సిపాలిటీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్లు త్వరలో మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు సమాచారం.మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు నాయకత్వం, ప్రజలకు అందుబాటులో ఉండే తీరు, ఆయన మార్గదర్శకత్వంలో జరుగుతున్న అభివృద్ధిని మెచ్చుకుని కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు వారు నిర్ణయించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మెదక్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది.

# మెదక్ జిల్లా మైనార్టీ మోర్చా కార్యవర్గం ఎన్నిక

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 31 (జన సంఘర్షణ)



భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా మైనారిటీ మోర్చా అధ్యక్షులు గ్యన్ సింగ్ అధ్వర్యంలో మైనారిటీ మోర్చా జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ రావడం జరిగింది. మైనారిటీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శులు నిరుడి లాజర్ సయ్యద్ గౌస్ పాషా ఉపాధ్యక్షులు కరమ్ సింగ్ షేక్ మొహమ్మద్ ఎండి ఖలీల్ కార్యదర్శిగా ఎం.డి నవబొద్దీన్ అజయ్ సింగ్ కోశాధికారిగా పర్వేజ్ జిల్లా కార్యవర్గ సభ్యులుగా సర్వన్ సింగ్ అమర్ సింగ్ లను నియమించడం జరిగింది. జిల్లా అధ్యక్షుల వారు వీరందరినీ పార్టీ కండువా కప్పి బాధ్యతలు ఇచ్చి అభినందలు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్ ఓ బి సి మోర్చా జిల్లా అధ్యక్షులు వడ్ల జనార్ధన్ పాపన్నపేట మండల అధ్యక్షులు సంతోష్ చారి జిల్లా నాయకులు లోకేష్ మధు రాజు శ్రీనివాస్ మనోజ్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# రేషన్ షాపుపై పౌరసరఫరాల శాఖ ఆకస్మిక తనిఖీ..

◆ **128 క్వింటాళ్లకు పైగా బియ్యం వ్యత్యాసం, డీలర్‌పై కేసు నమోదు**

సింగరేణి ప్రతినిధి: (జన సంఘర్షణ) న్యూస్



కారేపల్లి నియోజకవర్గ పరిధిలోని సింగరేణి మండలంలో పౌరసరఫరాల శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఖమ్మం రూరల్ సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ విజయబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో సీతారాంపురం గ్రామంలోని రేషన్ దుకాణాన్ని పరిశీలించారు. తనిఖీల సందర్భంగా రేషన్ బియ్యం నిల్వల్లో 128 క్వింటాళ్లు 37 కిలోల వ్యత్యాసం గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు రేషన్ డీలర్ ఈసం కృష్ణపై 6(ఏ) సెక్షన్ కింద కేసు నమోదు చేసి, రేషన్ దుకాణాన్ని సీజ్ చేశారు. ప్రజలకు రేషన్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ఉండేందుకు సమీప రేషన్ డీలర్ ఎట్టె నాగేశ్వరరావుకు ఆ దుకాణం అదనపు బాధ్యతలను తాత్కాలికంగా అప్పగించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ విజయబాబు మాట్లాడుతూ.. ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలకు ఎలాంటి అవకాశం ఇవ్వబోమని, నిబంధనలు ఉల్లంఘించే డీలర్లపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో సివిల్ సప్లై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వీరయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఫీజుల బకాయి బిజెపి లడాయి

◆ **విద్యార్థుల ఫీజు రియంబర్స్ మెంట్ ఉపకార వేతనాలు వెంటనే విడుదల చెయ్యాలి.**

◆ **బీజేవైయం జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ డిమాండ్.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 31 (జన సంఘర్షణ)



ఫీజుల బకాయలు బీజేపీ లడాయి" నినాదంతో రాష్ట్ర అధ్యక్షులు కుండె గణేష్, బీజేపీ జిల్లా అధ్యక్షులు కందనూరి శ్రీనివాస్ గౌడ్ సూచన మేరకు మెదక్ జిల్లాలోని పలు కాలేజీలో విద్యార్థుల చేత సంతకాల సేకరణ చేశారు ముఖ్య అతిథిగా హాజరైన యువమోర్చా జిల్లా అధ్యక్షులు కందనూరి శ్రీనివాస్ పాల్గొన్ని అయన మాట్లాడురు కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాశాఖ మంత్రి మంత్రిని కూడా పెట్టుకోలేని దుస్థితిలో వుందని దయ్యాపట్టారు. ముఖ్యమంత్రికి విద్యాశాఖ దగ్గరే వుందని విద్యార్థుల కష్టాలు మీకు కనిపించట్లేదా ప్రశ్నించరు. కేజీ టు - పీజీ విద్య అంటున్నారు. ప్రతి నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ అంటున్నారు కానీ, అన్ని మాటల్లోనే ఉన్నాయి.చేతల్లో చూపించడం లేదులి మీ ప్రభుత్వం.. దయవుంచి ప్రభుత్వం వెంటనే 40 లక్షల మంది విద్యార్థుల 15,000/- కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ , స్కాలర్షిప్ లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఫిజులపై పరిష్కారం చెయ్యకపోతే రాష్ట్ర స్థాయిలో నిరసనలు వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేవైయం అసెంబ్లీ కన్వీనర్ సాయి సతీష్ గౌడ్ జగదీష్ పాపన్నపేట మండల పార్టీ అధ్యక్షుడు సంతోష్ పృథ్వి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి హోటల్ రోడ్డు భద్రతా కేంద్రంగా మారాలి

◆ **గోల్డెన్ అవర్‌లో స్పందిస్తే ప్రాణాలు కాపాడవచ్చు.**

◆ **హైవే భద్రతలో హోటళ్ల భాగస్వామ్యం పెరగాలి.**

◆ **ప్రమాదాలను అరికట్టేందుకు సమిష్టి కృషి అవసరం.**

◆ **అలసిపోయిన డ్రైవర్లను విశ్రాంతి తీసుకునేలా ప్రోత్సహించాలి.**

◆ **పీఎం రాహత్, రాహ్‌వీర్ పథకాలపై అవగాహన కల్పించాలి.**

◆ **హైవే హోటళ్ల యాజమానులతో సమావేశం నిర్వహించిన మెదక్ జిల్లా ఎస్పీడి వి.శ్రీనివాస రావు.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 31 (జన సంఘర్షణ)





రోడ్డు ప్రమాదాల నివారణలో హైవే వెంబడి ఉన్న ధాబాలు, హోటళ్లు, రెస్టారెంట్ల యాజమాన్యం కీలక భాగస్వాములు కావాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జాతీయ రహదారుల వెంట ఉన్న ధాబాలు, హోటళ్లు, రెస్టారెంట్ల యాజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల సమయంలో గోల్డెన్ అవర్లో అందించే తక్షణ వైద్య సహాయం ప్రాణాలను కాపాడడంలో అత్యంత కీలకమని ఎస్పీ తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే 100, 112 లేదా 108కు సమాచారం అందించి క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించేలా హోటళ్ల యాజమాన్యం చొరవ తీసుకోవాలని సూచించారు. హోటల్ సిబ్బందికి ప్రథమ చికిత్స సీపీఆర్ పై అవగాహన కల్పించి, అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేలా శిక్షణ ఇవ్వాలని కోరారు. జిల్లాలో సుమారు 255 కిలోమీటర్ల మేర ఏడు జాతీయ రహదారులు ఉన్నాయని, ఈ మార్గాల్లో నిత్యం భారీ సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని తెలిపారు. కొందరు భారీ వాహనాల డ్రైవర్లు 8 నుంచి 10 గంటల పాటు విశ్రాంతి లేకుండా వాహనాలు నడపడం వల్ల అలసటకు గురై స్టీరింగ్‌పైనే నిద్రపోయి ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. అలసిపోయిన డ్రైవర్లను గుర్తించి కొంతసేపు విశ్రాంతి తీసుకునేలా ప్రోత్సహించాలని, పూర్తిగా అప్రమత్తమైన తర్వాతే ప్రయాణాన్ని కొనసాగించేలా చూడాలని యాజమాన్యానికి సూచించారు. ప్రతి రోడ్డు ప్రమాదం వెనుక ఒక కుటుంబం ఉంటుంది. ఒక తల్లి తన కుమారుడిని కోల్పోతుంది.. ఒక భార్య తన భర్తను కోల్పోతుంది.. పిల్లలు తమ తండ్రిని కోల్పోతారు. ఒక్క క్షణం నిర్లక్ష్యం జీవితాంతం మానని గాయాన్ని మిగులుస్తుంది. అందుకే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతను తమ బాధ్యతగా భావించి వ్యవహరించాలి అని ఎస్పీ పేర్కొన్నారు.రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం రాహత్ పథకం కింద రూ.1.5 లక్షల వరకు నగదు రహిత (క్యాష్‌లెస్) వైద్య చికిత్స అందుబాటులో ఉందని వివరించారు.అలాగే ప్రమాద బాధితులను గోల్డెన్ అవర్లో ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడేందుకు సహకరించిన వారికి కేంద్ర ప్రభుత్వ 'రాహ్‌వీర్' పథకం కింద రూ.25 వేల నగదు ప్రోత్సాహకం అందజేస్తారని తెలిపారు. ప్రమాద బాధితులకు సహాయం చేసిన వారిని గుడ్ సమారిటన్ మార్గదర్శకాల ప్రకారం చట్టపరంగా రక్షిస్తారని, ఎలాంటి ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు.హైవే వెంబడి ఉన్న ప్రతి హోటల్, ధాబాలో వాహనాల పార్కింగ్‌కు తగిన స్థలం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. పార్కింగ్ సౌకర్యం లేక జాతీయ రహదారులపై భారీ వాహనాలు నిలిపివేయడం వల్ల ప్రమాదాల ప్రమాదం పెరుగుతుందని పేర్కొన్నారు.





వాహనాలను క్రమపద్ధతిలో పార్కింగ్ చేయించేందుకు ప్రతి హోటల్‌లో ప్రత్యేకంగా ఒక సిబ్బందిని నియమించాలని సూచించారు. అలాగే జిల్లాలోని ప్రతి హోటల్, ధాబాలో కనీసం నాలుగు సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి, అవి నిరంతరం పనిచేసేలా చూడాలని ఆదేశించారు.హోటళ్లకు వచ్చే మహిళల భద్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ కార్యకలాపాలు, అనుమానాస్పద వ్యక్తుల సంచారంపై ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. అనుమానాస్పద ఘటనలు గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రతి హోటల్ ఒక రోడ్డు భద్రతా కేంద్రంగా మారాలి. అలసటతో ఉన్న డ్రైవర్లను విశ్రాంతి తీసుకునేలా ప్రోత్సహించడం, ప్రమాద బాధితులను గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి తరలించడం, మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వడం, మాదకద్రవ్యాలు, అక్రమ కార్యకలాపాలను అరికట్టడంలో పోలీసులకు సహకరించడం ద్వారా అనేక విలువైన ప్రాణాలను కాపాడవచ్చు అని ఎస్పీ పేర్కొన్నారు.ఈ సమావేశంలో మెదక్ అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, ఏఎంవీఐ,సీఐలు రంగా కృష్ణ, సందీప్ రెడ్డి,వెంకట రాజా గౌడ్, రాజశేఖర్ రెడ్డి, రేణుక, మహేష్, కృష్ణమూర్తితో పాటు జిల్లాలోని హైవే వెంబడి ఉన్న హోటళ్లు, ధాబాలు, రెస్టారెంట్ల యాజమానులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు మెరుగైన వైద్యం అందాలి

◆ **జిల్లా అదనపు కలెక్టర్ నగేష్.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 31(జన సంఘర్షణ)



నిరుపేదలకు మెరుగైన వైద్యం అందాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు.. శుక్రవారం మెదక్ పట్టణంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగుల గదులను, వంట గదులను, భోజన శాలను పరిశీలించారు. రోగులతో ముచ్చటించారు. వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యుల అటెండెన్స్‌ను చూశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. రోగులకు మెరుగైన వసతులు కల్పించి, చుట్టు పరిసరాల పరిశుభ్రం చేయాలన్నారు. నాణ్యమైన భోజనాన్ని అందించాలని వైద్య అధికారులకు సూచించారు. డాక్టర్స్ అందరూ అందుబాటులో ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నితిన్ కాబ్ర, శాకాధిపతి రవీంద్ర కుమార్, రేడియాలజిస్ట్ శారదా దేవి, ఆర్ఎంఓ శైలజ, శ్రీవిద్య, ప్రియాంక, నిర్మల, వంశీ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# మంబోజిపల్లి పల్లె చెరువుకు నిలిచిన వరద నీరు ప్రవాహం

◆ **కాల్వలో ప్రహరీ కూలడమే కారణం! గ్రామస్తులు ఆరోపణ.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 31(జన సంఘర్షణ)



మెదక్ మండలంలోని మంభోజిపల్లి గ్రామంలోని పల్లె చెరువుకు నిలిచిన వరద నీళ్లుకాల్వలో ప్రహరీ గోడ కులాడమే కారణమాని గ్రామస్తులు మీడియాతో ఆరోపించారు. మెదక్ మండల పరిధిలోని ఘనపూర్ ఆయకట్టు ద్వారా వచ్చే నీరు మాచవరం గ్రామం నుంచి మంబోజిపల్లి పల్లె చెరువులోకి వచ్చే నీటి కాల్వలో ప్రహరీ గోడ కూలిపోవడంతో నీటి ప్రవాహం పూర్తిగా నిలిచిపోయింది. దీంతో చెరువుకు నీరు చేరక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా మాచవరం గ్రామానికి చెందిన సూర్యకాంత్ (ఇంటి నెం. 1-1-20) నివాసం వద్ద ఉన్న ప్రహరీ గోడ కాల్వలో కూలిపోవడంతో పాటు కాల్వలో పేరుకుపోయిన మట్టిని తొలగించకపోవడంతో నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడిందని గ్రామస్తులు తెలిపారు. ఈ సమస్యపై మంబోజిపల్లి గ్రామ సర్పంచ్ మానస రాములు, ఉపసర్పంచ్ మహేష్, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులతో కలిసి ఇరిగేషన్ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..చెరువులోకి నీరు రాకపోవడంతో రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే కాల్వలోని మట్టిని తొలగించి, కూలిపోయిన ప్రహరీ కారణంగా ఏర్పడిన అడ్డంకులను తొలగించి చెరువులోకి నీరు సక్రమంగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యను నిర్లక్ష్యం చేస్తే రైతులతో కలిసి చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

# రాయన్ పల్లి వంతెన పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు ప్రత్యేక చొరవ

◆ **రూ.2.30 కోట్ల అంచనాతో ప్రభుత్వానికి ప్రతిపాదన - నిధుల మంజూరుకు నిరంతర ప్రయత్నాలు.**

◆ **రాయన్ పల్లి వంతెన వద్ద ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు.**

◆ **ఇది ఏడు గ్రామాలకు సంబంధించిన సమస్య కాబట్టి రైతులకు ఎలాంటి ఇబ్బంది కాకుండా డాక్టర్ మైనాంపల్లి రోహిత్ మెదక్ ఎమ్మెల్యే ఎప్పటికప్పుడు దీనిపైన సమీక్ష నిర్వహిస్తున్నారు.**

◆ **వర్షాకాలంలో ప్రజల భద్రతే లక్ష్యం అధికారులకు ఎమ్మెల్యే రోహిత్ రావు కీలక సూచనలు.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 31 (జన సంఘర్షణ)

మెదక్ మండలంలోని రైన్‌పల్లి గ్రామ వంతెన గత ఏడాది కురిసిన భారీ వర్షాల కారణంగా పూర్తిగా దెబ్బతినడంతో గ్రామ ప్రజలు, రైతులు, తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు జిల్లా,రాష్ట్ర స్థాయి అధికారులతో విస్తృతంగా చర్చలు జరిపారు. వంతెన పునర్నిర్మాణానికి సంబంధించి రూ.2.30 కోట్ల అంచనా వ్యయాన్ని సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించినట్లు తెలిపారు. ఈ ప్రతిపాదనకు త్వరితగతిన ఆమోదం లభించేలా తాను నిరంతరం సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తూ నిధుల మంజూరు కోసం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఇరిగేషన్ శాఖ అధికారులు,తహసీల్దార్‌తో మాట్లాడిన ఎమ్మెల్యే, కొత్త వంతెన నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రజలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అవసరమైతే తాత్కాలిక మరమ్మతులు చేయడంతో పాటు హెచ్చరిక బోర్డులు, రక్షణ కంచెలు ఏర్పాటు చేసి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. రాష్ట్ర ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్‌తో కూడా ఎమ్మెల్యే రోహిత్ రావు ప్రత్యేకంగా మాట్లాడి రైన్‌పల్లి వంతెన ప్రస్తుత పరిస్థితిని వివరించి, ఈ పనులకు అత్యవసర ప్రాధాన్యత ఇచ్చి నిధుల విడుదల వేగవంతం చేయాలని కోరారు.అదేవిధంగా మెదక్ అసెంబ్లీ నియోజకవర్గంలోని అన్ని వంతెనలు, కాలువలు, వాగులు, చెరువుల పరిస్థితిని సమీక్షించి, వర్షాకాలంలో ప్రమాదం ఏర్పడే అవకాశమున్న ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశించారు.



# నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తే కఠిన చర్యలు

- కానిస్టేబుల్ సుధాకర్ రెడ్డి సస్పెన్షన్.
- సలబత్పూర్ చెక్‌పోస్ట్ వీడియో వ్యవహారంపై ఎక్సైజ్ శాఖ కొరడా





**మద్నూర్, జులై 31 (జన సంఘర్షణ):** విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఎక్సైజ్ శాఖ అధికారులు ఘాటుగా హెచ్చరించారు. కామారెడ్డి జిల్లా మద్నూర్ మండల పరిధిలోని సలబత్పూర్ అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆరోపణలపై కానిస్టేబుల్ బి. సుధాకర్ రెడ్డిని సస్పెండ్ చేస్తూ జిల్లా మద్య నిషేధ, అబ్కారీ అధికారి బి. ముకుంద రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మహారాష్ట్ర-తెలంగాణ రాష్ట్రాల సరిహద్దులో ప్రభుత్వ అనుమతితో ఏర్పాటు చేసిన సలబత్పూర్ అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్‌కు సంబంధించిన వీడియో జూలై 30న సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్ కావడంతో ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించారు.

**విచారణ అనంతరం సస్పెన్షన్...**

జిల్లా మద్య నిషేధ, అబ్కారీ అధికారి బి. ముకుంద రెడ్డి ఆదేశాల మేరకు ఘటనకు సంబంధించిన అంశాలపై సమగ్ర విచారణ చేపట్టారు. విచారణ నివేదిక ఆధారంగా చెక్‌పోస్ట్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ బి. సుధాకర్ రెడ్డి విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు గుర్తించిన అధికారులు తక్షణమే సస్పెన్షన్ వేటు వేశారు.

**కానిస్టేబుళ్లకు ఉన్నతాధికారుల ఘాటు హెచ్చరిక...**

ఈ ఘటనతో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల్లో విధులు నిర్వహించే సిబ్బందికి ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం, అలసత్వం లేదా బాధ్యతారాహిత్యానికి తావిస్తే ఇకపై కఠినమైన శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతర్రాష్ట్ర సరిహద్దుల నుంచి అక్రమ మద్యం, గంజాయి, ఇతర నిషేధిత పదార్థాల రవాణాను అరికట్టడం చెక్‌పోస్ట్ సిబ్బంది ప్రధాన బాధ్యత అని అధికారులు స్పష్టం చేశారు. చెక్‌పోస్టుల్లో 24 గంటల పాటు విధులు పర్యవేక్షిస్తున్నామని, విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని తేల్చిచెప్పారు. సలబత్పూర్ ఘటనపై తీసుకున్న సస్పెన్షన్ చర్యను ఇకపై విధుల్లో అలసత్వం వహించే సిబ్బందికి ఒక గట్టి హెచ్చరికగా అధికారులు పేర్కొంటున్నారు.

# పొంగిపొర్లుతున్న కొల్లూరు వాగు.. రాకపోకలు బంద్

- భారీ వర్షాలతో ఉధృతంగా ప్రవాహం..
- రహదారి మరమ్మతులు వెంటనే చేపట్టాలని ప్రజల డిమాండ్

**పోతంగల్, జులై 31 (జన సంఘర్షణ):** నిజామాబాద్ జిల్లాలో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో కోటగిరి మండలంలోని కొల్లూరు వాగు పొంగిపొర్లుతోంది. వాగులో నీటి ప్రవాహం ఉధృతంగా ఉండటంతో బోధన్ నుంచి సుంకిని, కొల్లూరు వైపు వెళ్లే రహదారిపై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రజలు, వాహనదారులు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

**రాకపోకలు నిషేధం.. అప్రమత్తంగా ఉండాలని సూచన**

వాగు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో కొల్లూరు సర్పంచ్ జగన్ ప్రజలను అప్రమత్తం చేశారు. వాగు ప్రవాహం తగ్గే వరకు బోధన్ వైపు నుంచి సుంకిని, కొల్లూరు వైపు వాహనదారులు రాకపోకలు సాగించవద్దని సూచించారు. అలాగే కొల్లూరు నుంచి అవతలి వైపు వెళ్లకుండా గ్రామపంచాయతీ అధికారులు ట్రాక్టర్‌ను అడ్డుగా ఏర్పాటు చేసి రాకపోకలను నియంత్రిస్తున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ప్రజలు ఉండవద్దని, అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రావొద్దని అధికారులు సూచించారు. అదేవిధంగా విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలకు ప్రజలు దూరంగా ఉండాలని హెచ్చరించారు.

**రహదారి మరమ్మతులు వెంటనే చేపట్టాలి**

కొల్లూరు వాగు వద్ద రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి రహదారి పరిస్థితిని పరిశీలించి మరమ్మతు పనులు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. వర్షాలు పడిన ప్రతిసారి వాగు ఉధృతంగా



ప్రవహించడం, రహదారి దెబ్బతినడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకుని తాత్కాలిక చర్యలకే పరిమితం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని, రహదారి మరియు వాగు పరిసరాల్లో అవసరమైన రక్షణ చర్యలు వెంటనే చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# భారీ వర్షాలకు రాయిన్ పల్లి ప్రాజెక్ట్ కెనాల్‌తోపాటు ఏడు గ్రామాలకు ముప్పు

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 31 (జన సంఘర్షణ)** మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మెదక్ మండలం రాయినపల్లి ప్రాజెక్టు డిస్ట్రిబ్యూషన్ కెనాల్ కూలిపోగా, చెరువు కట్ట కూడా సగానికి పైగా దెబ్బతినడంతో ఏడు గ్రామాల ప్రజలు, రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి మాజీ డిప్యూటీ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పద్మా దేవేందర్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులతో కలిసి ప్రాజెక్ట్ ను పరిశీలించరు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యమే ఈ పరిస్థితికి కారణమని తీవ్రస్థాయిలో విమర్శించారు. గత ఏడాది వరద వల్ల దెబ్బతిన్న కాల్వలు, చెరువులు, రహదారులకు శాశ్వత మరమ్మతులు చేయకుండా తాత్కాలిక పనులతో సరిపెట్టడంకొన్నారని మండిపడ్డారు. డిస్ట్రిబ్యూషన్ కెనాల్ పూర్తిగా కూలిపోయిందని మూడు రోజుల వర్షాలకే కాల్వ కట్ట, చెరువు కట్ట దెబ్బతినడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. రైతుల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని మండిపడ్డారు. ప్రాజెక్టు డిస్ట్రిబ్యూషన్ కెనాల్ ద్వారా సుమారు 2500 ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు ఏడు గ్రామాలకు ప్రత్యక్షంగా, మరో పది గ్రామాలకు పరోక్షంగా నీటి సరఫరా జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం కాల్వ దెబ్బతినడంతో రైతుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా అయ్యిందని అన్నారు. రెండు నెలల క్రితమే రైతులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసి మరమ్మతులు చేపట్టాలని కోరినా ప్రభుత్వం, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు కెనాల్ పూర్తిగా కొట్టుకుపోవడంతో చెరువు కట్టకూ పెను ముప్పు ఏర్పడిందని, కామారెడ్డి జిల్లా దంతేపల్లి వైపు నుంచి వరద ప్రవాహం పెరిగితే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే వెంటనే స్పందించి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు ఏడు గ్రామాల ప్రజలు, రైతులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ట్రాక్టర్లు, జేసీబీల సహాయంతో స్వయంగా కట్టను పూడ్చే కార్యక్రమం చేపడతామని చెప్పారు. ఈ



కార్యక్రమంలో మెదక్ మండల పార్టీ అధ్యక్షులు యం. అంజ గౌడ్ తోపాటు మాజీ ఎంపీపీ కిష్టయ్య, మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, నాయకులు న్యాయవాది జీవన్ రావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగ నరేందర్, రాయన్ పల్లి మాజీ సర్పంచ్ నాగులు, పార్టీ అధ్యక్షులు జంగం వీరస్వామి, మెదక్ మున్సిపల్ కౌన్సిలర్ మామిళ్ళ. ఆంజనేయులు నాయకులు బాలయ్య నర్సాగౌడ్ నర్సింలు, దుర్గయ్య, కిష్టయ్య సిద్ధిరాములు, శీను భాస్కర్, యాదగిరి శ్రీధర్, రైతులు తదితరులు ఉన్నారు.

# పల్లె దవాఖానాలో ఎమ్మెల్యే పోచారం ఆకస్మిక తనిఖీ

- రోగులకు మెరుగైన వైద్యం అందించాలి.. సిబ్బందికి సూచనలు



**బాన్సువాడ/జూలై 31 (జనసంఘర్షణ):** బాన్సువాడ పట్టణంలోని పాత పల్లె దవాఖానాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దవాఖానలో రోగులకు అందుతున్న వైద్య సేవలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో మాట్లాడిన ఎమ్మెల్యే.. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమయానికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అవసరమైన మందులు, వైద్య పరికరాలు, ఇతర మౌలిక సదుపాయాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు రోగులకు సకాలంలో చికిత్స అందించాలని పోచారం సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండే వైద్య సేవలను మరింత మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీతో దవాఖానలో వైద్య సేవలపై మరింత పర్యవేక్షణకు అవకాశం ఏర్పడిందని స్థానికులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ పట్టణ ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మూడు నెలల రేషన్ పంపిణీని సద్వినియోగం చేసుకోవాలి

- రేషన్ కార్డుల eKYC - తేదీ పొడిగింపు.
- జిల్లా సివిల్ సప్లై అధికారి నిత్యానంద.



**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 31 (జన సంఘర్షణ)** మెదక్ జిల్లా పరిధిలోని అన్ని రేషన్ కార్డుదారులకు తెలియజేయునది ఏమనగా, ప్రభుత్వం ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్-2026 నెలలకు సంబంధించిన మూడు నెలల బియ్యం కోటాను ఒకేసారి పంపిణీ చేస్తున్నది. కావున ప్రతి రేషన్ కార్డుదారుడు 01.08.2026 నుండి తమ సమీప ఫెయిర్ ప్రైస్ షాప్‌కు వెళ్లి మూడు నెలల బియ్యం కోటాను తప్పనిసరిగా పొందవలెను. అదేవిధంగా, రేషన్ కార్డులోని ప్రతి సభ్యునికి 31.08.2026 లోపు ఈ కేవైసీ పూర్తి చేయించుకోవాలి. చిన్నారుల ఈ కేవైసీను ఐరిస్ (ఐరిస్) డివైస్ ద్వారా సులభంగా పూర్తి చేయవచ్చు. మూడు నెలల బియ్యం కోటాను సకాలంలో పొందడంతో పాటు, కుటుంబ సభ్యులందరి వ-ఖ్జను తప్పనిసరిగా పూర్తి చేయించుకొని ప్రభుత్వ సేవలను నిరంతరంగా పొందగలరు. మెదక్ జిల్లా పరిధిలోని అన్ని ఫెయిర్ ప్రైస్ షాప్ డీలర్లకు ముఖ్య సూచనలులి మెదక్ జిల్లా పరిధిలోని అన్ని డీలర్లు 01.08.2026 నుండి షాపులను నిర్ణీత సమయానికి తెరిచి, లబ్ధిదారులకు ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్-2026 నెలలకు సంబంధించిన మూడు నెలల బియ్యం కోటాను ఎలాంటి ఇబ్బందులు లేకుండా సక్రమంగా పంపిణీ చేయవలెను. అలాగే, మీ షాపు పరిధిలో వ-ఖ్జ పెండింగ్‌లో ఉన్న ప్రతి లబ్ధిదారునికి వ్యక్తిగతంగా సమాచారం అందించి, 31.08.2026 లోపు 100 శాతం వ-ఖ్జ పూర్తి అయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా చిన్నారుల వ-ఖ్జను ఐరిస్ (×తీఱం) డివైస్ ద్వారా పూర్తి చేయించాలి. ప్రతి గ్రామంలో చాటింపు (మైక్ అనౌన్స్‌మెంట్) ద్వారా మూడు నెలల బియ్యం పంపిణీ, e-KYC పూర్తి చేయవలసిన విషయాన్ని ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలి. ప్రతి రోజు e-KYC పురోగతి, బియ్యం పంపిణీని సమాంతరంగా నిర్వహిస్తూ, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలు అందించవలెను అని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## వర్షాల ధాటికి ఇళ్లు దెబ్బతినడంతో.. బాధితుల సురక్షిత తరలింపు

- డబుల్ బెడ్రూమ్ ఇళ్లలోకి తరలింపు.. ముందస్తు చర్యలతో తప్పిన ప్రాణనష్టం



**ఎడపల్లి, జూలై 31 (జన సంఘర్షణ)** గత రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలతో నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం రాణాకలాన్ గ్రామంలో పలు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. దీంతో అప్రమత్తమైన గ్రామ పంచాయతీ పాలకవర్గం వెంటనే సహాయక చర్యలు చేపట్టి బాధిత కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించింది. గ్రామానికి చెందిన షేక్ వహీదా, మెట్టు సుజాత, ఉచిర్ల లలిత ఇళ్లు వర్షాల కారణంగా దెబ్బతినడంతో ప్రమాదాన్ని ముందుగానే గుర్తించిన అధికారులు, గతంలో మంజూరైన డబుల్ బెడ్రూమ్ ఇళ్లలోకి బాధితులను సురక్షితంగా తరలించారు. దీంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా ప్రమాదం తప్పింది. అదేవిధంగా గ్రామంలో ఒంటరిగా నివసిస్తున్న చెవుల గౌరవ్వ అనే వృద్ధురాలిని కూడా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా ఆమె కుమారుడి ఇంటికి తరలించారు. వర్షాల నేపథ్యంలో గ్రామంలోని పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట తక్షణ సహాయక చర్యలు చేపడుతున్నట్లు స్థానిక ప్రజాప్రతినిధులు తెలిపారు. ప్రమాదాన్ని ముందుగానే గుర్తించి బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడంపై గ్రామస్తులు పంచాయతీ పాలకవర్గ ప్రతినిధులను అభినందించారు. ఈ సహాయక చర్యల్లో సర్పంచ్ అలేఖ్య శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రంజిత్, ఉపసర్పంచ్ రవి, గ్రామ నాయకులు దేవేందర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు. ముందస్తు అప్రమత్తత.. ప్రజల భద్రతకు తొలి ప్రాధాన్యం!

## తిరుమలపూర్‌లో భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా బోనాల సంబరాలు

- ఆటపాటలతో అలరించిన మహిళలు..
- పండుగ శోభతో కళకళలాడిన గ్రామం




**పోతంగల్ / జూలై 31 / జన సంఘర్షణ :** పోతంగల్ మండలం తిరుమలపూర్ గ్రామంలో బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీ మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు ఎత్తుకుని, ఆటపాటలతో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం మహిళలు, చిన్నారులు భక్తిగీతాలు, నృత్యాలతో ప్రధాన వీధుల గుండా బోనాల ఊరేగింపు నిర్వహించారు. దీంతో గ్రామమంతా ఆధ్యాత్మికత, ఆనందోత్సాహాలతో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని కొలుస్తూ కుటుంబాలు, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బోయి సైదవ్వ, వార్డు సభ్యులు కాలే లక్ష్మీబాయి, రమాబాయి, గ్రామస్తులు కాలే గంగారం, విజయ్, సాయి కృష్ణ, రవి, నగేష్, గోపాల్, యాదవరావు తదితరులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాల వేడుకలను విజయవంతం చేశారు. భక్తి, సంప్రదాయం, ఐక్యతకు ప్రతీకగా సాగిన ఈ వేడుకలు గ్రామంలో సంతోషాన్ని నింపాయి.

# సమయస్ఫూర్తి.. మెరుపు స్పందన.. నిలిచిన ఓ ప్రాణం

- డయల్-100కు సమాచారం అందగానే ఆత్మహత్యకు యత్నించిన మహిళను కాపాడిన దోమకొండ పోలీసులు

కామారెడ్డి / జూలై 31 / జన సంఘర్షణ :

డయల్-100కు అందిన సమాచారంపై దోమకొండ పోలీసులు సమయస్ఫూర్తితో స్పందించి ఆత్మహత్యకు యత్నించిన ఓ మహిళను సకాలంలో కాపాడారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని అప్రమత్తంగా వ్యవహరించి మహిళ ప్రాణాలను రక్షించారు. ప్రజలు ఎలాంటి ఆపదలో ఉన్నా, అత్యవసర పరిస్థితులు ఎదురైనా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు సూచించారు. సకాలంలో అందే సమాచారం ఒక ప్రాణాన్ని కాపాడగలదని పోలీసులు పేర్కొన్నారు.

**కామారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ**

కామారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని వివిధ




విభాగాలను పరిశీలించి, సిబ్బంది పనితీరు, కేసుల దర్యాప్తు, ప్రజలకు అందుతున్న సేవలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలతో పోలీసులు మానవీయంగా వ్యవహరించి, వారి సమస్యలను సానుకూలంగా విని సత్వర న్యాయం అందించేందుకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. విధుల్లో అప్రమత్తత, బాధ్యత, ప్రజల పట్ల మర్యాద ముఖ్యమని పేర్కొన్నారు.

**కామారెడ్డి జిల్లాలో ఆగస్టు నెలంతా 30, 30(ఎ) పోలీస్ యాక్ట్ అమలు**

కామారెడ్డి జిల్లాలో ఆగస్టు నెలంతా 30, 30(ఎ) పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర తెలిపారు. ఈ నేపథ్యంలో అనుమతి లేకుండా ధర్నాలు, ర్యాలీలు, సభలు, ఊరేగింపులు నిర్వహించడంపై నిషేధం ఉంటుందని అధికారులు హెచ్చరించారు. ప్రజలు, వివిధ సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు పోలీసుల నుంచి ముందస్తు అనుమతి తీసుకున్న తర్వాతే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే పోలీసుల ప్రధాన లక్ష్యమని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# రైస్ మిల్లులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల కొరడా!

- ధాన్యం పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తప్పవు.
- బకాయిలు చెల్లించకుంటే బ్లాక్‌లిస్ట్‌లోకి!
- బాన్సువాడలో రైస్ మిల్లుపై అధికారుల దాడి.......
- పెద్ద ఎత్తున ధాన్యం పక్కదారి పట్టించినట్లు అనుమానాలు
- టెండర్‌కు సంబంధించిన రూ.2 కోట్ల బకాయిలపై విచారణ

కామారెడ్డి బ్యూరో / జూలై 31 / జన సంఘర్షణ

ప్రభుత్వం కేటాయించిన ధాన్యాన్ని నిబంధనల ప్రకారం నూర్పిడి చేసి బియ్యంగా మార్చి ప్రభుత్వానికి అప్పగించాల్సిన రైస్ మిల్లర్లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. ధాన్యాన్ని పక్కదారి పట్టించడం, ప్రభుత్వానికి బకాయిలు చెల్లించడంలో జాప్యం చేయడం వంటి ఆరోపణల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు ముమ్మరమయ్యాయి. 2022-23లో గోదాముల కొరత కారణంగా కొంత ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు టెండర్ల ద్వారా కేటాయించిన విషయం తెలిసిందే. అయితే కేటాయించిన ధాన్యానికి సంబంధించిన లెక్కలు, ప్రభుత్వానికి చెల్లించాల్సిన మొత్తాల్లో భారీ బకాయిలు ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం.

**బాన్సువాడలో కీలక తనిఖీలు...**

ఈ క్రమంలో శుక్రవారం కామారెడ్డి జిల్లాలోని బాన్సువాడలో ఓ రైస్ మిల్లుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించినట్లు సమాచారం. కేటాయించిన ధాన్యంలో సుమారు లక్ష బస్తాలు పక్కదారి పట్టించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒక్కో బస్తా 40 కిలోల చొప్పున లెక్కిస్తే భారీ మొత్తంలో ధాన్యం వ్యవహారం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. అదేవిధంగా టెండర్‌కు సంబంధించిన సుమారు రూ. 2 కోట్ల మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉన్నప్పటికీ ఇప్పటివరకు చెల్లించకపోవడంపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. రైస్ మిల్లులో ధాన్యం నిల్వలు, రికార్డులు, లావాదేవీలు తదితర అంశాలను అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం.





**రైస్ మిల్ యజమానులకు గట్టి హెచ్చరిక....**

ప్రభుత్వానికి కేటాయించిన ధాన్యాన్ని పక్కదారి పట్టించడం, బయట మార్కెట్‌కు తరలించడం, ప్రభుత్వ బకాయిలు చెల్లించకుండా కాలయాపన చేయడం ఇకపై సహించేది లేదని అధికార యంత్రాంగం స్పష్టం చేస్తున్నట్లు తెలుస్తోంది. బకాయిలను వెంటనే చెల్లించడంతో పాటు ప్రభుత్వ ధాన్యానికి సంబంధించిన లెక్కలను పారదర్శకంగా సమర్పించాలని, లేనిపక్షంలో డబ్బుల రికవరీతో పాటు చట్టపరమైన చర్యలు, మిల్లుల సీజ్, బ్లాక్‌లిస్ట్ వంటి కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని కొన్ని రైస్ మిల్లులపై చర్యలు ప్రారంభమైన నేపథ్యంలో, మరిన్ని మిల్లులపై కూడా తనిఖీలు కొనసాగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**రైతుల ధాన్యంతో అక్రమాలకు చెక్!**

రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం ప్రభుత్వ ఆస్తి అని, దాన్ని అక్రమంగా బయట మార్కెట్‌కు తరలిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. రైతుల కష్టంతో పండిన ధాన్యాన్ని దుర్వినియోగం చేస్తే ఉపేక్షించబోమనే సంకేతాలను తాజా ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు ఇస్తున్నాయి.

**రైస్ మిల్లర్లకు స్పష్టమైన హెచ్చరిక:**

ప్రభుత్వ ధాన్యాన్ని పక్కదారి పట్టిస్తే చర్యలు తప్పవు....ప్రభుత్వ బకాయిలు వెంటనే చెల్లించాలి.....లెక్కల్లో తేడాలు ఉంటే విచారణ ఎదుర్కోవాల్సిందే.. అక్రమాలు నిర్ధారణ అయితే సీజ్, రికవరీ, బ్లాక్‌లిస్ట్ వంటి చర్యలు తప్పవు. దాడులు కేవలం తనిఖీలకే పరిమితమవుతాయా? లేక అక్రమాలకు పాల్పడిన రైస్ మిల్లులపై కఠిన చర్యలు తీసుకుంటారా? అన్నది వేచి చూడాల్సి ఉంది.

# నర్సంపేట్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కన్నుమూత

- బారాస పార్టీకి తీరని లోటు
- కంటతడి పెట్టిన కేసీఆర్...

నర్సంపేట/జూలై 31/(జన సంఘర్షణ)

నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి యశోద హాస్పిటల్ గురువారం రాత్రి 12 గంటలకు తుది శ్వాస విడిచారు. పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి చెందినట్లు ప్రకటించిన యశోద వైద్యులు. యశోదలో ఐదు రోజులుగా సుదర్శన్ రెడ్డికి వెంటిలేటర్ పై చికిత్స అందించిన వైద్యులు. ఐదు రోజులపాటు మృత్యుతో పోరాడే పెద్ది సుదర్శన్ రెడ్డి కన్నుమూయడంతో, గులాబీ పార్టీలో యువ నాయకుడు కోల్పోయాడు. తీవ్రమైన గుండె నొప్పి నాడీ వ్యవస్థ, నిర్వీరంతో సుదర్శన్ రెడ్డి మృతి చెందారు. ఈనెల 26న హన్మకొండలోని సుదర్శన్ రెడ్డికి చాతిలో నొప్పి రావడంతో ఆయనను ఆసుపత్రికి తరలించారు .చాతిలో నొప్పితో కడియా కరెక్ట్ గుర్తించిన వైద్యులు. 1974లో ఆగస్టు 6న ఉమ్మడి వరంగల్ జిల్లా నల్లబెల్లిలో సుదర్శన్ రెడ్డి జన్మించారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉన్న పెద్ది సుదర్శన్ రెడ్డి. 2023లో మూడోసారి నర్సంపేట నుంచి పోటీ చేసి సుదర్శన్ రెడ్డి ఓటమిపాలయ్యారు. 2018లో నర్సంపేట్ నుంచి మొదటిసారిగా అసెంబ్లీకి ఎన్నికైన సుదర్శన్ రెడ్డి. 2016 నుంచి రాష్ట్ర పౌరసరపరాల సంస్థ చైర్మన్గా సుదర్శన్ బాధ్యతలు చేపట్టారు. 2014లో నర్సంపేట నుంచి అసెంబ్లీకి పోటీ చేసి ఓటమిపాలైన సుదర్శన్ రెడ్డి. టిఆర్ఎస్ పోలీ బ్యూరో సభ్యుడుగా సుదర్శన్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. చాలాకాలం ఉమ్మడి వరంగల్ జిల్లాకు టిఆర్ఎస్ అధ్యక్షుడిగా పనిచేసిన సుదర్శన్ రెడ్డి. కెసిఆర్ కు నమ్మకస్తుడిగా ఉన్న పెద్ది సుదర్శన్ రెడ్డి కెసిఆర్ తో తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న సుదర్శన్ రెడ్డి. ఉద్యమకారుడుగా సుదర్శన్ రెడ్డి తెలంగాణ ఉద్యమానికి ఎంతో తోడ్పాటు అందించారు. కెసిఆర్ తో తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. 2001లో దుగ్గొండి నుంచి జెడ్పిటిసిగా ఎన్నికైన పెద్ది సుదర్శన్ రెడ్డి. కాంగ్రెస్ పార్టీలోనూ పనిచేసిన సుదర్శన్ రెడ్డి. పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పట్ల గులాబీ నేత కెసిఆర్, కేటీఆర్, హరీష్ రావు, ప్రముఖులు ఆయన మృతి పట్ల ఘనంగా నివాళు లర్పించారు. ఒక యువ నాయకుడు కన్నుమూయడం బారాసనం పార్టీకి తీవ్ర లోటు అంటూ మహిళా మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ వ్యాఖ్యానించారు. సుదర్శన్ రెడ్డి లేని లోటు బారాసకు తీవ్ర దిబ్బ అంటూ గులాబీ శ్రేణులు వ్యాఖ్యానించారు. వరంగల్ జిల్లాకు ఎంతో అభివృద్ధికి కృషి చేశారని సుదర్శన్ రెడ్డి చేసిన సేవలను




ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు తాము ఎప్పుడు అండగా ఉంటామని రేవంత్ రెడ్డి భరోసా కల్పించారు. శుక్రవారం పెద్ది సుదర్శన్ రెడ్డి భౌతిక గాయానికి సందర్శించడానికి పెద్ద ఎత్తున గులాబీ శ్రేణులతో పాటు వివిధ పార్టీల నేత నాయకులు వస్తున్నారు.

# మూడు నెలలరేషన్ బియ్యం పంపిణీ ఈకేవైసీ గడువు పొడిగింపు

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 31(జన సంఘర్షణ)

రేషన్ కార్డుల ఈకేవైసీ గడువును ఈనెలాఖరు వరకు పొడగించడం జరిగిందని జిల్లా సివిల్ సప్లయ్ అధికారి నిత్యానంద్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకొని ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ప్రభుత్వం 3నెలల రేషన్ ఒకేసారి పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. నేటి నుండి ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ (3) నెలల రేషన్ ఒకేసారి పంపణీ చేయడం జరుగుతుందని, లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లబ్దిదారులు రేషన్ దుకాణాలకు ఇబ్బందులు పడుతూ వెళ్లవద్దని, ఆగస్టు నెలాఖరు వరకు రేషన్ బియ్యం సరఫరా చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో మొత్తం 2,41,832 కార్డులు ఉండగా, 7,90,304 మంది లబ్దిదారులు ఉన్నట్లు తెలిపారు. వీరికి రేషన్ షాపుల ద్వారా 50,03,495 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి: అలాగే ప్రతి రేషన్‌కార్డు లబ్దిదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకుంటేనే రేషన్ బియ్యం అందిస్తారని తెలిపారు. ఈకేవైసీ చేసుకునేందుకు ప్రభుత్వం ఆగస్టు నెలాఖరు వరకు గడువు పొడగించిందని, ఈ అవకాశాన్ని లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రతి లబ్దిదారులు రేషన్ బియ్యం తీసుకోవడంతోపాటు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు. డీలర్లు లబ్దిదారులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే గ్రామాల్లో ఈకేవైసీ, 3నెలల రేషన్ సరఫరాపై చాటింపు వేయాలని డీఎస్ఓ నిత్యానంద్ తెలిపారు.

# యువ నాయకుడు జన్మదిన వేడుక

- కరుటూరి సతీష్ కుమార్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, జూలై 31(జనసంఘర్షణ):



చర్ల లో మిత్రులు, సన్నిహితులు ఆధ్వర్యంలో కరుటూరి సతీష్ కుమార్ జన్మదిన వేడుక ఘనంగా జరుపుకున్నారు. సతీష్ మరేన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని మిత్రులు కోరుకున్నారు, ఈ కార్యక్రమం లో డాక్టర్ సింహాచలం, డాక్టర్ సమ్మయ్య, పెట్రోల్ బంక్ మేనేజర్ గంధం రవి, కజ్జం భాస్కర్, నాగేంద్ర, శివ, కారం నరేష్, చింతూరి రజనీకాంత్, ముమ్మనేని అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# మల్లాపూర్ శివారులో పేకాట స్థావరంపై పోలీసుల మెరుపు దాడి

- ఏడుగురు పేకాట రాయుళ్లు అరెస్ట్.. నగదు, బైకులు, సెల్‌ఫోన్లు స్వాధీనం
- పేకాట, జూదానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవు: ఎస్సై రాములు

బాన్సువాడ, జూలై 31 (జన సంఘర్షణ):




బీర్కూర్ మండలం మల్లాపూర్ గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు శుక్రవారం మెరుపు దాడి నిర్వహించారు. నమ్మదగిన సమాచారం మేరకు బీర్కూర్ ఎస్సై రాములు తన సిబ్బందితో కలిసి దాడి చేసి పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 12,410 నగదు, మూడు మోటార్‌సైకిళ్లు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. నిందితులపై సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్సై రాములు ప్రజలకు ఘాటైన హెచ్చరిక జారీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పేకాట, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతూ యువత భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. పేకాట స్థావరాలు నిర్వహించినా, వాటిలో పాల్గొన్నా చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు ఎవరు పాల్పడినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అలాగే తమ పరిసరాల్లో పేకాట, జూదం లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతోనే జూదం, అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా అరికట్టగలమని ఎస్సై పేర్కొన్నారు. ఈ దాడిలో హెడ్ కానిస్టేబుల్ లక్ష్మయ్య, కానిస్టేబుళ్లు తిరుపతి, సంతు, భాను, శివ, హోంగార్డు మొగలయ్య పాల్గొన్నారు.

# గోదావరి వరద పరిస్థితిని పరిశీలన

- ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, జూలై 31(జనసంఘర్షణ):



భద్రాచలం నియోజకవర్గం. భద్రాచలం గోదావరి కరకట్ట ప్రాంతాలను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి పలు సూచనలు, సలహాలు తెలియజేసిన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో మాట్లాడి, గోదావరి ఎగువ ప్రాంతం నుంచి వేగంగా వరద నీరు వస్తున్న నేపథ్యంలో కరకట్ట ప్రాంతాలను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు గారు పరిశీలించారు. గోదావరి వరద నీరు పట్టణంలోకి ప్రవేశించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన అన్ని రక్షణ చర్యలను అప్రమత్తంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ, వార్డు సభ్యులు బొంత రమణ, కారం దుర్గారావు, తాటి ఉదయ్, పార్టీ నాయకులు నర్రా రాము, ధర్మారావు, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ గాడి విజయ్, ఎండి సుభాని, ఏలురి రాము తదితరులు పాల్గొన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
శనివారం
01 ఆగస్టు 2026

# వ్యవసాయ పొలంలో పడి వ్యక్తి మృతి..

- మూర్ఛ రావడంతో ప్రమాదం



పోతంగల్,/ జూలై 31/ (జనసంఘర్షణ): పోతంగల్ మండలం కొల్లూరు గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సిరిగిరి హనుమంతు (48) శుక్రవారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఉదయం సుమారు 5:10 గంటల సమయంలో వ్యవసాయ పొలాల వైపు వెళ్లిన హనుమంతుకు అకస్మాత్తుగా మూర్ఛ రావడంతో, నీరు నిలిచిన వ్యవసాయ పొలంలో పడిపోయాడు. దీంతో నీటిలో మునిగి ఊపిరాడక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి భార్య లింగవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తులో వెల్లడికానున్నాయి.

# భార్య మృతి.. భర్తపై కేసు నమోదు

- మద్యం మత్తులో వేధింపులు, దాడి చేశాడని కుటుంబసభ్యుల ఆరోపణ



నిజామాబాద్:/జూలై 31/(జన సంఘర్షణ) నిజామాబాద్: అంకాపూర్‌కు చెందిన వివాహిత సుమలత మృతి చెందిన ఘటనపై ఆమె భర్త ఉప్పు రవిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని సీఐ సత్యనారాయణగౌడ్ తెలిపారు. కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. సుమలతను ఆమె భర్త రవి మద్యం మత్తులో తరచూ శారీరకంగా, మానసికంగా వేధించేవాడని ఆరోపించారు. ఇటీవల కూడా ఆమెపై తీవ్రంగా దాడి చేయడంతో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో శుక్రవారం సుమలత తన తల్లిగారి ఇంట్లో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు పేర్కొన్నారు. బాధితురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త ఉప్పు రవిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ సత్యనారాయణగౌడ్ తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి రావాల్సి ఉంది.

# ప్రజలకు హెచ్చరిక.. అప్రమత్తంగా ఉండాలి!

- భారీ వర్షాల నేపథ్యంలో పోతంగల్ మండల ప్రజలకు కోటగిరి ఎస్సై శ్రీనివాస్ యాదవ్ విజ్ఞప్తి....




పోతంగల్, జూలై 31/ (జన సంఘర్షణ): మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోటగిరి ఎస్ఐ శ్రీనివాస్ యాదవ్ సూచించారు. అత్యవసర పరిస్థితి ఉంటే తప్ప ప్రజలు వర్షాల సమయంలో బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వాగులు, వంకలు, చెరువులు, కాలువలు, లోతట్టు ప్రాంతాల వద్దకు ప్రజలు వెళ్లవద్దని, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండేలా కుటుంబ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసించే వారు సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు. భారీ వర్షాల సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్ అధికారులు నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ అవసరమైన సహాయ చర్యలు చేపడుతున్నారని కోటగిరి ఎస్సై శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ అధికారులు చేస్తున్న అప్రమత్తత చర్యలపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షాల సమయంలో అధికారులు అందించే సూచనలు పాటించి సహకరించాలని ఎస్సై కోరారు.

# బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే హైడ్రాను బంగాళాఖాతంలో విసిరేస్తాం




పోతంగల్/జులై 31/(జన సంఘర్షణ) పోతంగల్: బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న హైడ్రా వ్యవస్థను బంగాళాఖాతంలో విసిరేస్తామని బీఆర్ఎస్ నాయకుడు డాక్టర్ ,ఎం.ఏ. హకీమ్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వ వ్యవస్థలు భయాందోళనలకు కారణమయ్యేలా వ్యవహరించడం సరికాదని ఆయన అన్నారు. పేదలు, సామాన్య ప్రజల ఇళ్ల విషయంలో అధికారులు నిబంధనల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా వ్యతిరేక విధానాలను సమీక్షించి, అవసరం లేని వ్యవస్థలను ప్రక్షాళన చేస్తామని హకీమ్ స్పష్టం చేశారు. ప్రజల సంక్షేమమే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. "ప్రజలను భయపెట్టే పాలన కాదు.. ప్రజలకు భరోసా ఇచ్చే పాలన కావాలి. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తే హైడ్రా పేరుతో జరుగుతున్న వేధింపులకు ముగింపు పలుకుతాం" అని డాక్టర్ ఎం.ఏ. హకీమ్ ఘాటుగా పేర్కొన్నారు.

# బాధితుల వివరాలు బహిర్గతం చేస్తే కఠిన చర్యలు

- మీడియా, సోషల్ మీడియా వినియోగదారులకు పోలీస్ కమిషనర్ హెచ్చరిక




నిజామాబాద్, జూలై 31 (జనసంఘర్షణ): లైంగిక నేరాలు, మహిళలు, చిన్నారులకు సంబంధించిన కేసుల్లో బాధితుల గుర్తింపును బహిర్గతం చేయడం చట్టవిరుద్ధమని, అలాంటి చర్యలకు పాల్పడితే కఠిన న్యాయపరమైన చర్యలు తప్పవని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. బాధితుల పేరు, ఫొటో, వీడియో, ఇంటి చిరునామా, విద్యాసంస్థ, ఉద్యోగ స్థలం, కుటుంబ సభ్యుల వివరాలు, గ్రామం లేదా కాలనీ పేరు, సోషల్ మీడియా ఖాతాలు తదితర వారి గుర్తింపును ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వెల్లడించే ఎలాంటి సమాచారాన్ని ప్రచురించరాదని స్పష్టం చేశారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాతో పాటు యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్, వాట్సాప్, టెలిగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లోనూ బాధితుల గుర్తింపును తెలియజేసే పోస్టులు, వీడియోలు, చిత్రాలను ప్రచురించడం చట్ట ఉల్లంఘనగా పరిగణించబడుతుందని పేర్కొన్నారు. భారత సుప్రీంకోర్టు మార్గదర్శకాలతో పాటు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), పోక్సో చట్టం నిబంధనలను ప్రతి మీడియా సంస్థ, జర్నలిస్టు, సోషల్ మీడియా వినియోగదారు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. బాధితుల వివరాలు బయటపెట్టడం వల్ల వారికి, వారి కుటుంబ సభ్యులకు మానసిక వేదన, సామాజిక అవమానం, భద్రతాపరమైన సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. అందువల్ల బాధితుల గోప్యతను కాపాడుతూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పోలీస్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు. చట్టాలను ఉల్లంఘించి బాధితుల గుర్తింపును బహిర్గతం చేసే వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# ప్రజల సేవే నా లక్ష్యం.. వారి ఆశీస్సులే నా విజయానికి బలం

- ఎత్తొండ గ్రామ సర్పంచ్ శ్వేత సూర్యకాంత్





కోటగిరి/జూలై 31/(జన సంఘర్షణ): మహిళలు రాజకీయాల్లోకి రావాలంటే ఎన్నో కుట్రలు, కుతంత్రాలు, విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుందని, అయితే ఎవరేమన్నా పట్టించుకోకుండా ప్రజల కోసం ముందుకు సాగితే విజయం తప్పకుండా మనదేనని ఎత్తొండ గ్రామ సర్పంచ్ శ్వేత సూర్యకాంత్ అన్నారు. గత 9 నెలలుగా నిరంతరం ప్రజల మధ్య ఉంటూ, వారి సమస్యలను తెలుసుకుంటూ, సేవలో నిమగ్నమయ్యానని ఆమె తెలిపారు. ఎత్తొండ గ్రామ సేవకురాలిగా పనిచేస్తూ, తన విలువైన సమయాన్ని గ్రామ ప్రజల కోసం కేటాయించానని పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచి ప్రజాప్రతినిధిగా అవకాశం కల్పించి, గౌరవప్రదమైన సర్పంచ్ పదవిని అందించిన ఎత్తొండ గ్రామ ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు అందించిన ఈ గౌరవం తనకు ఎంతో ఆనందాన్ని, మరింత బాధ్యతను కలిగించిందని శ్వేత సూర్యకాంత్ అన్నారు. గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. "ఎత్తొండ గ్రామ ప్రజలే నా కుటుంబం.. వారి సంతోషమే నా సంతోషం. ప్రజలు నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, గ్రామ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తాను. నా జీవితంలో ఎల్లప్పుడూ నా గ్రామ ప్రజల కోసమే ఉంటాను" అని సర్పంచ్ శ్వేత సూర్యకాంత్ ఆనందంగా తెలిపారు.

# కుక్కల, కోతుల బెడద నివారణకు బాన్సువాడ మున్సిపాలిటీ ప్రత్యేక కార్యాచరణ

- కుక్కల, కోతుల బెడద నివారణకు బాన్సువాడ మున్సిపాలిటీ ప్రత్యేక కార్యాచరణ
- శుక్రవారం నుంచి ప్రత్యేక బృందాలతో పట్టివేత - చైర్పర్సన్ కాసుల విజయ బాల్ రాజ్



బాన్సువాడ/జూలై 31/(జన సంఘర్షణ) బాన్సువాడ: పట్టణంలో వీధి కుక్కలు, కోతుల బెడదకు శాశ్వత పరిష్కారం చూపేందుకు బాన్సువాడ మున్సిపాలిటీ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. శుక్రవారం నుంచి ప్రత్యేక బృందాలతో పట్టివేత, నియంత్రణ చర్యలు చేపట్టనున్నట్లు మున్సిపల్ చైర్పర్సన్ కాసుల విజయ తెలిపారు. ఆమె 'తెలంగాణ డైలీ న్యూస్ ' తో మాట్లాడారు.

**చిన్నారులపై దాడుల నేపథ్యంలో నిర్ణయం**

ఇటీవల బాన్సువాడ పట్టణంలో వీధి కుక్కల దాడిలో చిన్నారులు గాయపడటం అత్యంత బాధాకరమైన ఘటన అని చైర్పర్సన్ ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో కుక్కలతో పాటు కోతుల బెడద కూడా ఉందని గుర్తు చేశారు. ఈ రెండు సమస్యల నివారణకు మున్సిపాలిటీ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. తీసుకుంటున్న చర్యలు:శుక్రవారం నుంచి ప్రత్యేక బృందాలు బాన్సువాడ పట్టణంలో కుక్కలు, కోతులను పట్టుకునే కార్యక్రమం ప్రారంభం వీధి కుక్కలను ప్రభుత్వ నిబంధనల మేరకు స్టెరిలైజేషన్ చికిత్స మరియు యాంటీ రేబిస్ టీకాల కోసం తరలింపు. కోతుల నియంత్రణకు సంబంధిత శాఖల సమన్వయంతో అవసరమైన చర్యలు ప్రజలకు విజ్ఞప్తి. ప్రజలు కొద్ది రోజుల పాటు అప్రమత్తంగా ఉండాలని చైర్పర్సన్ కోరారు. ముఖ్యంగా చిన్నారులను ఒంటరిగా బయటకు పంపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇళ్ల పరిసరాల్లో ఆహార వ్యర్థాలు, తినుబండారాల అవశేషాలు బయట వేయకుండా పరిశుభ్రత పాటించాలని విజ్ఞప్తి చేశారు.

**పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి**

ప్రజల భద్రత, ఆరోగ్య సంరక్షణ కోసం మున్సిపాలిటీ ఇతర చర్యలు కూడా చేపట్టింది. బాన్సువాడ పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట ఉన్న మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్త, మట్టిని ప్రత్యేక యంత్రాల సహాయంతో తొలగించారు. వర్షాల సమయంలో నీరు నిల్వ ఉండకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. స్టేట్ బ్యాంక్ ప్రాంతం, తాడ్కోల్ రోడ్ పరిసరాల్లో ఈ సమస్య అధికంగా ఉండేదని, పూడిక తొలగించిన అనంతరం మురుగు నీరు సజావుగా ప్రవహిస్తూ ప్రజలకు ఇబ్బందులు తగ్గాయని ఆమె తెలిపారు. పట్టణ ప్రజల భద్రత, పరిశుభ్రత మరియు ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ, కుక్కలు, కోతుల బెడదతో పాటు పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి మున్సిపాలిటీ అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని మున్సిపల్ చైర్పర్సన్ కాసుల విజయ స్పష్టం చేశారు.

# కుమార్తె వివాహానికి సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం





హైదరాబాద్/జూలై 31/(జన సంఘర్షణ) హైదరాబాద్: జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు తన కుటుంబ సభ్యులతో కలిసి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు తన కుమార్తె వివాహ ఆహ్వాన పత్రికను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజేశారు. వివాహ వేడుకకు కుటుంబ సమేతంగా విచ్చేసి వధూవరులను ఆశీర్వదించాలని సీఎం రేవంత్‌రెడ్డిని సాదరంగా ఆహ్వానించారు. ఈ మర్యాదపూర్వక భేటీలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

Printed, published and owned by **Rachamallu Madhavi** Printed at **Kranthi Printing Press**, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : **Rachamallu Madhavi**. **RNI Reg No :tel/2024/89323,** Cell 6305026524, Email:janasangarshana@gmail.co